

# కాస్త ఊరట

**తెరిపిచ్చిన వాన**
**ఊపిరి పీల్చుకున్న ప్రజలు**
**సాయంత్రం కొన్నిచోట్ల ఓమోస్తరు నుంచి భారీ వర్షం**



కాట్రేనికోన మండలంలో నీట మునిగిన వరి పొలాల వద్ద రైతు

అమలాపురం, ఆగస్టు18(ఆంధ్రజ్యోతి): సోమవారం ఉదయం నుంచి జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో వాతావరణం పొడిగానే ఉంది. వర్షాలు కురవకపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. చలి, ఈదురుగాలులు వీచడంతోపాటు జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో సాయంత్రం పూట ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ముఖ్యంగా రావులపాలెం పరిసర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. అల్పపీడనం కారణంగా అధికారులు ముందు జాగ్రత్తగా కోనసీమ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సెలవు ప్రకటించారు. మిగిలిన జిల్లాలన్నింటికీ ఆదివారం రాత్రికే సోమవారం స్కూళ్లకు సెలవు అని ప్రకటించినప్పటికీ కోనసీమ జిల్లాలో మాత్రం సోమవారం ఆలస్యంగా సెలవు ప్రకటించడంతో కొన్ని పాఠశాలలకు చెందిన విద్యార్థులు యథావిధిగా పాఠశాలలకు చేరుకున్నారు. ఆ తరువాత విద్యాశాఖ అధికారులు జారీచేసిన ఉత్తర్వుల నేపథ్యంలో స్కూళ్లకు సెలవు ప్రకటిస్తున్నట్టు విద్యార్థులను పంపించి వేశారు. అధికారుల మధ్య సమన్వయ లోపం కారణంగా తలెత్తిన సమస్యతో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ఇబ్బందులకు గురయ్యారు. ఇక జిల్లావ్యాప్తంగా కురుస్తున్న వర్షాలతో జనం అవస్థలు పడుతుండగా, చేలు ముంపులో చిక్కుకున్నాయి. రైతులు నానాపాట్లు పడుతున్నారు.

### అత్యధికంగా ఉప్పలగుప్తంలో..

జిల్లాలో ఆదివారం నుంచి సోమవారం ఉదయం తెల్లవారుజాము వరకు కరిసిన వర్షపాతం జిల్లాలో అత్యధికంగా 40.4 మిల్లీమీటర్ల వర్షపాతం ఉప్పలగుప్తంలో నమోదైంది. అత్యల్పంగా 17.2 మిల్లీమీటర్ల వర్షపాతం సఖినేటిపల్లి మండలంలో నమోదు కాగా జిల్లాలో 26.7 మిల్లీమీటర్ల వర్షపాతం సగటున నమోదైంది. ఆత్రేయపురం మండలంలో 24. 4మిల్లీమీటర్ల, మండపేట 21.6, రాయవరం 26, రామచంద్రపురం 26.2, ఆలమూరు 28.2, రావులపాలెంలో 23.4, కొత్తపేట 26.4, కపిలేశ్వరపురం 30.2, కె.గంగవరం 24.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అలాగే ఐ.పోలవరంలో 37.4 మిల్లీమీటర్ల, ముమ్మిడివరం 28.23, అయినవిల్లి 32, పి.గన్నవరం 22.8, అంబాజీపేట 26.4, మామిడికుదురు 22.2, రాజోలు 19.6, మలికిపురం 25.4, అల్లవరం 25.8, అమలాపురం 24.4, కాట్రేనికోన 33.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు కొన్ని ప్రాంతాలు మినహా మిగిలిన ప్రాంతాల్లో వర్షపాతం నమోదు కాలేదు.

# 'పెన్షన్' కలకలం!



నెలనెలా రూ.6 వేల పెన్షన్ పొందుతున్న దివ్యాంగుల్లో అనర్హులను గుర్తించే ప్రక్రియ తుది దశకు చేరుకుంది. ప్రత్యేక వైద్య బృందాలతో దివ్యాంగత్వాన్ని పునః పరిశీలన ద్వారా అనర్హులను ఏరివేసే కార్యక్రమాన్ని ఇటీవల ప్రభుత్వం చేపట్టింది. వైకల్యం, చూపు, వినికిడి, మానసిక రుగ్మతలతోపాటు వివిధ దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఈ పెన్షన్లను అందిస్తున్నారు. ఇందులో కొందరు అర్హత మేరకు వైకల్య శాతం ఉండకపోయినా పెన్షన్ పొందుతున్నట్టు గుర్తించారు. ఈ మేరకు జిల్లాలో 2,899 దివ్యాంగ పెన్షన్లను నిలిపివేయడం కలకలం సృష్టించింది.

- దివ్యాంగ పెన్షన్ల పరిశీలన దాదాపుగా పూర్తి
- సెప్టెంబరు నుంచి అనర్హులు ఏరివేత
- జిల్లావ్యాప్తంగా 2,899 పెన్షన్లు నిలుపుదల
- 652 మంది ఇతర పెన్షన్లకు బదలాయింపు
- అర్హత ఉంటే అప్పీలుకు మరో అవకాశం

అమలాపురం రూరల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): అర్హులైన దివ్యాంగులందరికీ పెన్షన్లు అందించడంతోపాటు అనర్హులను గుర్తించేందుకు ఈ ఏడాది ప్రథమార్థంలో ప్రభుత్వం దివ్యాంగ పెన్షన్ల పరిశీలనా కార్యక్రమం చేపట్టింది. పెన్షన్ల పరిశీలన అనంతరం జిల్లాలో ఏకంగా 2,899 మందిని అనర్హులుగా గుర్తించారు. ప్రత్యేక షెడ్యూల్ మేరకు వైద్యుల బృందం దివ్యాంగ పెన్షన్ల పరిశీలన చేపట్టింది. ఈనేపథ్యంలో జిల్లాలో అనర్హులైన 2,899 మంది పెన్షన్లను సెప్టెంబరు నుంచి నిలుపుదల చేస్తున్నట్టు జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు తెలిపారు. జిల్లాలో పెన్షన్ల వెరిఫికేషన్‌కు హాజరుకానివారు, ఇంతవరకు షెడ్యూలు పొందనివారు 7,888మంది ఉన్నట్టు లెక్క తేల్చారు. దివ్యాంగ శాతాన్ని బట్టి పెన్షన్లు ఇవ్వడంతో పాటు దివ్యాంగ పెన్షన్లకు అనర్హులు అయినప్పటికీ వృద్ధాప్య, ఇతర కేటగిరీలకు అర్హత ఉన్న 652 మందిని ఇతర పెన్షన్లకు బదలాయించారు. జిల్లావ్యాప్తంగా 32,101 మంది దివ్యాంగ పెన్షన్ల పరిశీలనకు లక్ష్యంగా నిర్దేశించారు. వారిలో లోకోమోటార్ పెన్షన్లు 16,934, విజువల్ ఇంపైర్‌మెంట్ 4,036, హియరింగ్ ఇంపైర్మెంట్ పెన్షన్లు 3,992, మెంటల్ రిటార్డేషన్ పెన్షన్లు 3,751, మెంటల్ ఇల్‌నెస్ 1,277, మల్టిపుల్ డిజేబులిటీ పెన్షన్లు 2,111 ఉన్నాయి. వీటిలో ఇప్పటివరకు 24,213 పెన్షన్ల పరిశీలనను వైద్యుల బృందం పూర్తిచేసింది. ఇంకా 7,888 మంది పెన్షన్ల పరిశీలన చేయాల్సి ఉంది. వీరిలో పలువురికి షెడ్యూల్ ఇచ్చినప్పటికీ హాజరుకాలేదని చెప్పారు. మిగిలిన వారికి షెడ్యూల్ ప్రకటించాల్సి ఉంది. పెన్షన్ల పరిశీలన తర్వాత అత్యధికంగా ఆలమూరు మండలంలో 212 పెన్షన్లు, అత్యల్పంగా అమలాపురం అర్బన్‌లో 36 పెన్షన్లను నిలుపుదల చేశారు. పెన్షన్ల పరిశీలన అనంతరం సచివాలయాల వారీ జాబితాలను విడుదల చేశారు. ఆయా దివ్యాంగ పెన్షన్‌దారులకు నోటీసులు జారీ చేస్తున్నారు. అయితే పెన్షన్లు నిలుపుదల అయినవారు అప్పీలు చేసుకునే అవకాశం కల్పించారు. నోటీసు అందుకున్న 30రోజుల్లోగా సంబంధిత మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మున్సిపల్ కమిషనర్లకు అప్పీలు చేసుకోవచ్చని డీఆర్డీఏ అధికారులు తెలిపారు.

# బార్‌లకు బేరం



- జిల్లాలో 9 బార్‌లకు నోటిఫికేషన్ జారీ
- అదనంగా కల్లుగీత కార్మికులకు మరో రెండు
- ప్రతీ బార్‌కు నాలుగు దరఖాస్తులు పడాల్సిందే
- జనాభా ప్రాతిపదికన ఫీజులు
- అమలాపురం, మండపేటలో బార్‌కు వచ్చి రూ.55 లక్షల ఫీజు
- పర్యాటక 'దిండి'లో బార్
- ఈనెల 26లోగా దరఖాస్తులు
- కలెక్టరేట్‌లో 28న లక్కీడ్రా



జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రసాద్

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

నూతన ఎక్సైజ్ బార్ పాలసీ-2025-28 సంవత్సరానికి సంబంధించి జిల్లాలో మొత్తం 11 బార్‌లకు నోటిఫికేషన్ సోమవారం జారీ చేశారు. వీటిలో ఒక పర్యాటకశాఖ బార్‌తోపాటు మొత్తం తొమ్మిది బార్‌లు మున్సిపాలిటీల పరిధిలోను, అదేవిధంగా రెండు గీత కార్మికులకు కేటాయించిన బార్‌లు అదనంగా ఉన్నాయి. అయితే ప్రస్తుతం తొమ్మిది బార్‌లకు సంబంధించి అప్లికేషన్ ఫీజు, ప్రాసెస్ ఫీజు, మొత్తం బార్ నిర్వహణకు చెల్లించాల్సిన ఫీజులతో కూడిన వివరాలను జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్కేడీవీ ప్రసాద్ తెలిపారు. ఆ ప్రకారం జిల్లా పరిధిలో అమలాపురం మున్సిపాలిటీలో మూడు బార్‌లు, మండపేట మున్సిపాలిటీలో రెండు, రామచంద్రపురం మున్సిపాలిటీలో రెండు, ముమ్మిడివరంలో ఒకటి, పర్యాటక కేంద్రమైన దిండిలో ఒక బార్‌కు ఉత్తర్వులు జారీచేశారు. వీటికి సంబంధించి విధివిధానాలు చూస్తే జిల్లాలో 50 వేలు పైబడిన మున్సిపాలిటీలుగా ఉన్న అమలాపురం, మండపేటల్లో బార్ నిర్వహణకు రూ. 55 లక్షలు చెల్లించాలి. అలాగే 50వేలలోపు జనాభా కలిగిన రామచంద్రపురం, ముమ్మిడివరం, దిండి ప్రాంతాల్లో రూ.35 లక్షలు బార్ నిర్వహణ ఫీజు కింద చెల్లించాలని నిర్ణయించారు. దీంతోపాటు ప్రతీ బార్‌కు నాలుగు అప్లికేషన్లు తప్పనిసరిగా వేయాలనే నిబంధన విధించారు. దీని ద్వారా ప్రభుత్వానికి మంచి ఆదాయం వస్తుంది. దీనిలో భాగంగా ప్రతీ బార్ అప్లికేషన్ ఫీజు కింద రూ.5లక్షలు చెల్లించాలి. ప్రాసెస్ ఫీజు కింద రూ.10వేల వంతున ఎక్సైజ్ శాఖకు చెల్లించాలి. సోమవారం నుంచి ఈనెల 26వ తేదీ వరకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నల్లవంతెన వద్దనున్న జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కార్యాలయం వద్ద దరఖాస్తులను స్వీకరిస్తారు. ఈనెల 28న అమలాపురంలోని గోదావరి భవన్‌లో లక్కీడిప్ ద్వారా బార్‌ల యజమానులను ఎంపిక చేయనున్నారు. లక్కీడిప్‌లో విజేతలైనవారు ఫీజులో సంవత్సరానికి రెండు వాయిదాల్లో ఆ మొత్తాన్ని చెల్లించే విధంగా వెసులుబాటు కల్పించారు. అదేవిధంగా ప్రతీ ఏడాది మొత్తం ఫీజులో 10 శాతం సొమ్ములు చెల్లించి రెన్యువల్ చేయించుకోవాలనే నిబంధన విధించారు. అప్లికేషన్ ఫీజును చలనాల ద్వారా డీపీఈవో అమలాపురం పేరిట డీడీ తీయాలి. ప్రాసెస్ ఫీజు మాత్రం కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ మంగళగిరి పేరిట డీడీ తీసి వాటితో దరఖాస్తులను ఎక్సైజ్‌శాఖ జిల్లా కార్యాలయంలో అందించాలి. పాత పాలసీ ప్రకారం అప్లికేషన్‌దారుల మధ్య పోటీతత్వం పెంచడం వల్ల కొన్నిచోట్ల అధిక మొత్తంలో పాటపాడే అనేక మంది లైసెన్సుదారులకు ఆర్థిక ఒత్తిడికి గురయ్యారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రస్తుత పాలసీ ప్రకారం జనాభా ప్రాతిపదికన లైసెన్సు ఫీజులు నిర్ణయించామని, అలాగే ఏడాదిలో రెండు వాయిదాల పద్ధతిలో మొత్తం ఫీజును చెల్లించే విధంగా అవకాశం కల్పించినట్టు ఎక్సైజ్ సూపరింటెండెంట్ తెలిపారు. బార్లు ప్రతీరోజు ఉదయం 10 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు నిర్వహించుకునే వెసులుబాటు కల్పించారు. అయితే బార్ లైసెన్సు పొందే వ్యక్తులు ముందుగాగానీ లేదా లైసెన్సు పొందిన 15 రోజుల తరువాతగానీ తప్పనిసరిగా రెస్టారెంట్‌ను కూడా ఏర్పాటుచేయాలనే నిబంధన అమలులో ఉందన్నారు. బార్ అండ్ రెస్టారెంట్‌గా వీటిని నిర్వహించుకోవాలని సూచించారు. ప్రస్తుతం అధికారంగా ప్రకటించిన 9 బార్‌లతోపాటు గీత కార్మికుల కోటాలో రామచంద్రపురంలో ఒకటి, అమలాపురంలో ఒకటి బార్‌లు ఏర్పాటుకు త్వరలో ఉత్తర్వులు వెలువడతాయని, వీటికి సంబంధించిన విధివిధానాలు అప్పుడు తెలియజేస్తామని అధికారులు చెబుతున్నారు. గీత కార్మికులు మద్యం వ్యాపార సంస్థల్లో ఇచ్చిన భాగస్వామ్యం మేరకు వారికి రెండు బార్‌లు రానున్నాయి.

## వ్యాపారుల్లో నిరాశ!

బ్రాందీ షాపులు, బార్లు ఏవైనాసరే సిండికేట్లుగానే రంగంలోకి దిగుతారు. అదీ మద్యం వ్యాపారంలో ఏళ్ల తరబడి ఉన్న వాళ్లే ఎక్కువగా ఉంటారు. కొత్తవాళ్ల రావడం, నిలదొక్కుకోవడం అరుదు. ఇప్పుడు కొత్త బార్ పాలసీపై ప్రస్తుత బార్ వ్యాపారస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేలం విధానంతో ప్రభుత్వానికి ఎక్కువ ఆదాయం సమకూరుతుంది. అందువల్ల వైసీపీ హయాంలో ఆ విధానాన్ని అమలుచేశారు. కానీ ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో లాటరీ విధానాన్ని అమలుచేస్తోంది. జనాభా ప్రాతిపాదికన ఫీజు ఫిక్స్ చేసి లాటరీ వేస్తున్నారు. అయితే ఒక్కో బార్‌కి కనీసం 4 దరఖాస్తులు వస్తేగానీ లాటరీ వేయరు. ఒక్కో దరఖాస్తుకు నాన్ రిఫండబుల్ ఫీజు రూ.5లక్షలు, ప్రాసెసింగ్ ఫీజు రూ.10వేలు మొత్తం రూ.5.10 లక్షలు చెల్లించాలి. అంటే నలుగురు కూటమిగా ఏర్పడి ఒక బార్‌కి నాలుగు దరఖాస్తులు సమర్పిస్తే.. ఆ దరఖాస్తు వెల రూ.20.40 లక్షలు అవుతుంది. బార్ ఏడాది లైసెన్సు ఫీజు కలుపుకుంటే.. మొత్తం రూ.కోటిపైనే అవుతుంది. నిర్వహణా ఖర్చులు, వడ్డీలు వంటివి కలుపుకుంటే బార్‌లో రోజుకు అమ్మకాలు కనీసం రూ.75వేలకు పైగా ఉంటేనే గిట్టుబాటవుతుందని లెక్కలు వేస్తున్నారు. ఇప్పుడు మద్యం షాపులలో అన్ని బ్రాండ్‌ల మద్యం దొరుకుతోంది. దాంతో బార్‌లలో అదనపు ధరలతో అమ్మితే ఎంతమేర విక్రయాలు సాగుతాయన్నది మరో ప్రశ్న. దీనికి తోడు పర్మిట్‌రూమ్‌లకు పర్మిషన్ ఇస్తున్నందున వాటి ప్రభావం కూడా బార్‌లపై పడే అవకాశం ఉంది. అలాగే ఒక బార్‌కి 4 దరఖాస్తులు, ఇష్యూ ప్రైస్‌పై 15శాతం అదనంగా అదనపు రిటైల్ ఎక్సైజ్ టాక్స్ (ఏఆర్‌ఈటీ) వసూలు అంశాలపైనా వ్యాపారుల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇవన్నీ బేరీజు వేసుకుంటే వ్యాపారం చేయడం కష్టమేనని, పాలసీలో మార్పులు తీసురావాలన్నది వ్యాపారుల తాజా డిమాండు.

# ఎరువుల కొరత సృష్టిస్తే చర్యలు

**కలెక్టర్ మహేష్‌కుమార్ హెచ్చరిక**

అమలాపురం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో ఎరువులను పక్కదారి పట్టించి కృత్రిమ కొరత సృష్టించే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఖరీఫ్ వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్న తరుణంలో ఎరువులు సమృద్ధిగా ఉన్నాయని తెలిపారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్న దృష్ట్యా ఒక కిలో ఎరువు కూడా పక్కదారి పట్టడానికి వీల్లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. సాగు అవసరాల మేరకే వినియోగించుకునేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఎరువుల లెక్కలకు సంబంధించి ఆన్‌లైన్ రికార్డులతో లావాదేవీలు పారదర్శకంగా ఉండాలని, యూరియాతో పాటు డీఏపీ, ఎంవోపీ, ఎస్ఎస్‌పీ కాంప్లెక్సు ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. వ్యవసాయాధికారుల సూచనల మేరకే వాటిని వినియోగించాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

### విద్యార్థులకు బ్యాగుల పంపిణీ..

పొగాకు వ్యతిరేక దినోత్సవంలో భాగంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన సంతకాలు సేకరించిన ప్రతి మండలంలో ముగ్గురు విద్యార్థులకు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సోమవారం బ్యాగులు పంపిణీ చేశారు. హృదయ సంబంధిత వ్యాధులకు ఎలా దారి తీస్తుందో అవగాహన కల్పించి పొగాకు వాడకాన్ని మానేయాలని ప్రజలతో ప్రతిజ్ఞ చేయించడం పొగాకు వాడకానికి వ్యతిరేకంగా ప్రచారం చేయడం వంటి కార్యక్రమాల ముఖ్య ఉద్దేశమన్నారు. పాఠశాలల విద్యార్థులు వినూత్న తరహాలో ప్రచార కార్యక్రమాలు చేపట్టి పొగాకు వ్యతిరేక ఉద్యమానికి బలం చేకూర్చారని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డీఎం హెచ్‌వో ఎం.దుర్గారావుదొర, ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎం.సుమలత, సోషల్ వర్కర్ కె.ప్రమీల తదితరులు పాల్గొన్నారు.



చించినాడ బ్రిడ్జి మరమ్మతుల కారణంగా సఖినేటిపల్లి రేవు వద్ద ప్రయాణికుల రద్దీ

## సఖినేటిపల్లి రేవుకు ప్రయాణికుల తాకిడి

**భారీగా నిలిచిన వాహనాలు**

అంతర్వేది, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాలకు వారధిగా ఉన్న దిండి-చించినాడ వంతెన మరమ్మతుల నేపథ్యంలో సఖినేటిపల్లి-నర్సాపురం రేవు ప్రయాణికులతో కిక్కిరిసింది. ఇటీవల బ్రిడ్జి మరమ్మతులు చేపట్టినా చిన్నచిన్న వాహనాలకు అనుమతి ఇవ్వడంతో ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురవ్వలేదు. 18 నుంచి 21వ తేదీ వరకు పూర్తిగా ట్రాఫిక్ నిలుపుదల చేయడంతో ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లు, లారీలతో రేవులో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. సఖినేటిపల్లి-నరసాపురం రేవుకు అరకిలోమీటరు మేర కార్లతో రోడ్డుపై గంటల కొలదీ ప్రయాణికులు వేచి ఉన్నారు. గత నాలుగు రోజులుగా సెలవులు కావడంతో చాలా బంధువుల ఇళ్లకు వెళ్లి పోయారు. మంగళవారం నుంచి పాఠశాలల నేపథ్యంలో తిరుగుముఖం పట్టారు. దీంతో రద్దీ నెలకొంది. మునుపెన్నడూ లేనివిధంగా ప్రయాణికులు రావడంతో ఒక్కసారిగా సఖినేటిపల్లి-నర్సాపురం రేవులు జనసందోహంతో నిడిపోయాయి. సాధారణ ప్రయాణికులతోపాటు దిండి-చించినాడ మీదుగా వెళ్లే ప్రయాణికులు రేవు మీదుగా వెళ్లడంతో సఖినేటిపల్లి రహదారిలో రద్దీ ఏర్పడింది.

## నేడే పీ4 ప్రారంభం

**తొలుత ఆరు జిల్లాల్లో ప్రారంభించనున్న సీఎం**
**రెండో విడతలో తూర్పు**

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పీ4 బంగారు కుటుంబాల దత్తతు స్వీకరణ కార్యక్రమం పథకం మంగళవారం విజయవాడలో సీఎం చంద్రబాబు ప్రారంభిస్తున్నారు. తొలుతగా ఆరు జిల్లాల్లో పథకాన్ని ప్రారంభిస్తున్నారు. దీనిలో ఉమ్మడి కృష్ణా జిల్లా, ఉమ్మడి గుంటూరు జిల్లాలు ఉన్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో తర్వాత ప్రారంభించనున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పీ 4 బంగారు కుటుంబాల దత్తత స్వీకరణ లక్ష్యం 2 లక్షల 19 వేలు కాగా దాన్ని కాస్తా 2 లక్షల 11 వేలకు కుదించారు. దీనిలో ఇప్పటివరకు 1,64,249 బంగారు కుటుంబాల దత్తతు స్వీకరించారు.ఇంకా 46,751 కుటుంబాలను దత్తత స్వీకరించడానికి అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. బంగారు కుటుంబాల అవసరాలు ఏమిటో తెలుసుకోవడానికి కుటుంబ అవసరాల (నీడ్ అసెస్మెంట్) సర్వే విజయవంతంగా నిర్వహించారు. మిగిలిన లక్ష్యాన్ని చేరుకోవడానికి అధికారులు మార్గదర్శులుతో సంప్రదింపులు చేస్తున్నారు. రెండో విడతలో ఇక్కడ పథకాన్ని ప్రారంభించే అవకాశం ఉన్నట్టు అధికారిక సమాచారం.

## గోదావరి పరవళ్లు

కాటన్ బ్యారేజీ నుంచి 6,07,682 క్యూసెక్కులు సముద్రంలోకి విడుదల

## చించినాడ-దిండి వంతెన మరమ్మతులు ప్రారంభం

ఫెయిల్ అయ్యాడని తండ్రి మందలింపు.. ఉరివేసుకున్న ఇంజనీరింగ్ విద్యార్థి

7

## ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 135 అర్జీలు



కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం టౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై అందిన అర్జీలను అధికారులు క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి నాణ్యమైన పరిష్కార మార్గాలు చూపించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారి నుంచి కలెక్టర్ మహేష్‌కుమార్‌తోపాటు జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, డీఆర్వో కె.మాధవి, డీఎస్వో ఎ.ఉదయ భాస్కర్, ఎస్‌డీసీ పి.కృష్ణమూర్తి, డీఎల్డీవో రాజేశ్వరరావులు 135 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కార తీరుపై ప్రజల్లో నమ్మకం పెంచాలన్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. నిర్ణీత గడువులోగా అర్జీలను పరిష్కరించడంతో పాటు రీఓపెనింగ్‌కు ఆస్కారం లేకుండా చేయాలని ఆదేశించారు.

### తల్లికి వందనం ఇప్పించండి...

వేగివారిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కవలలైన పిల్లలిద్దరు 8వ తరగతి చదువుతున్నారు. మా ఆధార్‌కార్డులకు ఎవరెవరివో విద్యుత్ మీటర్లు అనుసంధానం అయ్యాయి. దాంతో తొలి విడతలో తల్లికి వందనం నిలుపుదల చేశారు. వెంటనే ఆ లోపాలన్నింటినీ సరిచేయించుకుని సచివాలయంలో అందజేశాం. ఇంతవరకు తల్లికి వందనం సొమ్ములు మాత్రం పడలేదు. నిరుపేదలమైన మాకు తల్లికి వందనం సొమ్ములు ఇప్పించి ఆదుకోవాలని అర్జీ అందించాం.

- కె.స్రవంతి, వేగివారిపాలెం

### కాలనీని ముంచెత్తుతున్న మురుగు

మాచవరం గ్రామంలోని జగనన్న కాలనీలో జీవిస్తున్నాం. మా కాలనీకి రోడ్లు, డ్రైనేజీ సదుపాయం లేక ఇక్కట్లు పడుతున్నాం. ఇప్పుడు మా గ్రామంలోని మురుగునీటినంతా లోతట్టు ప్రాంతంలో ఉన్న కాలనీలోకి విడిచి పెడుతున్నారు. దీంతో ముంపులో రోగాల బారినపడి జీవించాల్సి వస్తోంది. ఈ సమస్యను పరిష్కరించి ఆదుకోవాలని అర్జీ అందించాం.

- ఎస్.వీరలక్ష్మి, నల్లమిలి సుజాత, జె.అనంతలక్ష్మి, జి.శుక్రవారం, మాచవరం గ్రామ మహిళలు, రాయవరం మండలం



జిల్లా పోలీసు కార్యాలయంలో అర్జీలు స్వీకరిస్తున్న ఎస్పీ కృష్ణారావు

## జిల్లా పోలీసు కార్యాలయంలో 26 అర్జీలు

అమలాపురం టౌన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఎస్పీ బి.కృష్ణారావు ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి అర్జీలు స్వీకరించి స్వయంగా వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే సంబంధిత పోలీసు అధికారులతో ఎస్పీ మాట్లాడి చట్ట పరిధిలో ఆయా సమస్యలను విచారించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. పీజీఆర్ఎస్ ఫిర్యాదులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కుటుంబ కలహాలు, భూవివాదాలు, ఇతర సమస్యలపై 26 అర్జీలను ఎస్పీ స్వీకరించారు. ఆయా ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను నిర్ణీత సమయంలోగా నివేదిక పంపించాలని ఎస్పీ ఆదేశించారు.


రోడ్‌కం రైలు బ్రిడ్జి చెంత..


రెండు బ్రిడ్జిల మధ్య బంగారు గోదారి..


కమనీయ దృశ్యం

## 'చిత్ర' కథా లోకం..

కెమెరా అంటేనే ఒక దృశ్య కావ్యం. కవిత, కథల్లానే కెమెరాకూ ప్రత్యేక భాష ఉంది. ఎన్నో భావాలకు అద్దంపడుతూ ఏదొక ఆవిష్కరణ చేస్తుంది. ఒక్కోసారి తనదైన సృజనతో, జీవకళతో ప్రాణం పోసే శిల్పిగా మారుతుంది. అలా అని కెమెరాకు చిక్కిన చిత్రాలన్నీ అపురూపం కాకపోవచ్చు. కానీ కొన్ని చిత్రాలు మాత్రం అజరామరాలు. ఒక్కో చిత్రం ఒక్కో కథ చెబుతుంది. మాటలకు దొరకని ఊసులెన్నిటినో మదిని తట్టి లేపి చూపెడుతుంది. అందుకనే కెమెరాను కళ్లతో పోల్చి చెబుతాం. అన్నట్టు ఈరోజు అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవం. ఆ సందర్భంలో అపురూప చిత్రాల మాలిక..

గోదావరి.. చిత్రకారులకు పెద్ద కాన్వాసు. కవులకు, రచయితలకు ఓ భావోద్వేగ ఝురి. ఎందుకంటే పౌర్ణమి రోజొక అందం.. అమావాస్య చీకటి మాటునొక రసరమ్య చందం. ఎలా చూస్తే అలా గోదావరి సాక్షాత్కరిస్తుంది. అందుకే ఎంతో సాహిత్యం, సినీ గీతాలు కోకొల్లలుగా వచ్చాయి. వస్తున్నాయి. అయినా.. అనుభూతి చెందాలంటే రాసినవి, గీసినవి చూస్తేనే వస్తుందా.. కాదు.. కాదంటారు మన ఫొటోగ్రాఫర్లు. గోదావరి అందాలను ఎన్నో కోణాల్లో పట్టి చూపారెందరో. 'ఆంధ్రజ్యోతి' రాజమహేంద్రవరం స్టాఫ్ ఫొటోగ్రాఫర్ బాబి కూడా గోదావరి అందాలను తనదైన కెమెరా కళ్లతో క్లిక్‌మనిపించారిలా..


గిరిపుత్రికల జీవన సౌందర్యం




## జీవన సౌందర్యం

### నేడు అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవం

వేయి మాటలు చెప్పలేని భావాన్ని ఒకే ఒక్క ఫొటో చెబుతుంది. ఎన్నో భావాలనే కాకుండా గతకాలపు జ్ఞాపకాలను మళ్లీ.. మళ్లీ ఆవిష్కరించే అవకాశం ఒక్క ఫొటో వల్ల సాధ్యం. మంగళవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం. ఈ సందర్భంగా శ్రామికుల కష్టాలు, గిరి పుత్రుల శ్రమైక జీవన సౌందర్యం వంటి ఈ ఛాయా చిత్రాలివి. ఇవి వారి జీవన శైలికి అద్దంపడతాయి. గిరిజన మహిళల మనుగడకు సజీవ సాక్ష్యాలుగా నిలుస్తాయి. కొండకోనల్లో దట్టమైన అటవీ ప్రాంతంలో గిరిజన మహిళల శ్రమైక జీవనాన్ని ప్రత్తిపాడుకు చెందిన ఫొటోగ్రావర్ సలాది కృష్ణ ఇటీవల గిరిజన ప్రాంతం అరకు, దుబ్రిగూడ, ఆంధ్ర, ఒడిస్సా సరిహద్దు ప్రాంతాల్లోని గిరిజన మహిళలు, యువతులపై తీసిన చాయాచిత్రాలు వారి జీవన మనుగడ కళ్లముందు ఉంచుతాయి. గిరిజనుల సంప్రదాయ వస్త్రధారణ.. కార్మికుడి కుండల తయారీలో ఏకాగ్రత, గిరిజన మహిళల ఆహార ఉత్పత్తుల అమ్మకాలు వంటి ఎన్నో ఈ ఛాయా చిత్రాలను ఆయన తన కెమెరాలో బంధించారు.

- ఆంధ్రజ్యోతి, ప్రత్తిపాడు


ప్రకృతిలో ఒదిగిపోదామా..




కాకినాడ జిల్లా క్రీడామైదానంలో ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు(ఫైల్)

## క్రీడా పోటీలకు వేళాయే!

- ధ్యాన్‌చంద్ జయంతిని పండుగగా నిర్వహించేందుకు 'శాప్' సన్నాహాలు
- 22న కాకినాడలో మూడు జిల్లాలకు జోనల్ స్థాయి క్రీడా పోటీలు
- జిల్లాస్థాయి పోటీల విజేతలు అర్హులు
- రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

కార్పొరేషన్(కాకినాడ)-ఆంధ్రజ్యోతి: క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈనెల 29న ధ్యానచంద్ జయంతి సందర్భంగా క్రీడా పండుగను ఘనంగా నిర్వహించేందుకు శాప్ కృషిచేస్తోంది. 22న కాకినాడలో మూడు జిల్లాలకు జోనల్‌స్థాయి, తర్వాత రాష్ట్రస్థాయి పోటీలను విజయవాడలో నిర్వహించనున్నారు.

14ఏళ్ల పైబడి 22ఏళ్లలోపు క్రీడాకారులు సత్తా చాటేందుకు జిల్లా, జోన్, రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహించేందుకు రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) సన్నాహాలు చేసింది. 2029లో అమరావతిలో జాతీయ క్రీడల నిర్వహణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసేందుకే రాష్ట్రవ్యాప్తంగా ఈ పోటీలు నిర్వహించనుంది. హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటివరకు దీన్ని నామమాత్రంగా జరుపుతుండగా శాప్ ఛైర్మన్ ప్రోత్సాహంతో ఈ ఏడాది ప్రత్యేకంగా రాష్ట్రవ్యాప్తంగా క్రీడా పండుగ జరపనున్నారు. మూడు దశల్లో నిర్వహించే పోటీలకు అయ్యే ఖర్చును శాప్ భరించనుంది.

### కాకినాడలోనే జోనల్ స్థాయి పోటీలు

పది క్రీడాంశాల్లో స్త్రీ, పురుషులకు పోటీలు నిర్వహిస్తారు. ఇప్పటికే జిల్లాస్థాయిలో పోటీలు నిర్వహించగా ఇక్కడ గెలుపొందిన వారికి జోనల్‌స్థాయి పోటీలు నిర్వహించనున్నారు. జోనల్ విజేతలకు రాష్ట్రస్థాయి పోటీలను విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహిస్తారు. ఇటీవల కాకినాడలోని జిల్లా క్రీడామైదానం, పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడాప్రాంగణాల్లో జరిగినజిల్లాస్థాయి పోటీల్లో అధికసంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారు. కాకినాడ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలకు జోనల్ స్థాయి పోటీలు కాకినాడ కేంద్రంగా ఈనెల 22న జరగనున్నాయి.

### క్రీడా విభాగాలు

సింగిల్స్,డబుల్స్ బాక్సింగ్, ఆర్చరీ, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, హాకీ, కబడ్డీ, ఖోఖో, వెయిట్‌లిఫ్టింగ్, వాలీబాల్, అథ్లెటిక్స్ 100 మీటర్లు, 400 మీటర్లు, 800 మీటర్లు, లాంగ్ జంప్, షాట్‌పుట్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తారు.

### ప్రతిభను వెలికితీసేందుకే..



ఈపోటీల్లో ప్రతిభ కనబరిచే క్రీడాకారులకు శాప్ ఆధ్వర్యంలో నిర్వహించే క్రీడా అకాడమీల్లో అవకాశంకల్పిస్తారు. క్రీడల అభివృద్ధికి ఇలాంటి టోర్నమెంట్లు ఉపయోగపడతాయి. జిల్లాలో క్రీడాసంఘాల ప్రతినిధులు, వ్యాయామ ఉపాధ్యాయుల సహకారంతో జిల్లాస్థాయి పోటీలు విజయవంతంగా జరిగాయి. జట్లసభ్యులు, క్రీడాకారులు 22న కాకినాడలో జరిగే జోనల్‌స్థాయి పోటీల్లోను, ఇక్కడి విజేతలు రాష్ట్రస్థాయి పోటీల్లోను పాల్గొంటారు.

-శ్రీనివాస్‌కుమార్, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి, కాకినాడ జిల్లా

## యువతకు ప్రోత్సాహం అందించేందుకు ముందుంటాం

● టీవోసీఐసీ కోఆర్డినేటర్ జ్యోత్స్న


సమావేశంలో మాట్లాడుతున్న జ్యోత్స్న

దివాన్‌చెరువు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) జీవితంలో ఏదైనా సాధించాలనే నూతన ఆలోచనలు గల యువతకు ప్రోత్సాహం అందించడానికి తాము ముందుంటామని డీఎస్ఐఆర్- టెక్నోప్రెన్యూర్ ప్రమోషన్ ప్రోగ్రాం ఔట్రీచ్ కమ్ క్లస్టర్ ఇన్నోవేషన్ సెంటర్ (టీఓసీఐసీ) కోఆర్డినేటర్ ఆచార్య పి.జ్యోత్స్న అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్ఛ్ ( డిఎస్ఐఆర్) ఎంఎస్ఎంఈ ఆవిష్కరణల ప్రోత్సాహం, వ్యవస్థాపకత అనే అంశంపై సోమవారం వర్క్‌షాప్‌ను నిర్వహించారు. దీనికి నన్నయ వీసీ ప్రసన్నశ్రీ, టిఓసిఐసి కోఆర్డినేటర్ జ్యోత్స్న ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా జ్యోత్స్న మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న వ్యక్తులు, అంకుర పరిశ్రమలకు వినూత్న ఆలోచనలు, సాంకేతిక పురోగతికి మద్దతు ఇవ్వడమే దీని లక్ష్యమని అన్నారు. వారికి ఆర్థిక సహకారం అందిస్తామన్నారు. డీ.ఎస్.ఐ.ఆర్., పి.ఆర్.ఐ.ఎ స్.ఎం.ల పనితీరు, వాటిద్వారా ఆవిష్కర్తలు ఏవిధంగా లబ్ధి పొందవచ్చు వంటి విషయాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ మాట్లాడుతూ నూతనశక్తితో సృజనాత్మకత, ఆవిష్కరణ ప్రయాణాన్ని ప్రారంభిద్దామన్నారు. డీఎస్ఐఆర్ గురించి వివరించారు. వేగవంతమైన సాంకేతిక పురోగతి యుగంలో ఆవిష్కరణ అవసరమన్నారు. ఆచార్య వరదరాజు నాయుడు మాట్లాడుతూ దేశంతోపాటు ప్రపంచ దేశాలలోనూ నూతనాలోచనలను ఆవిష్కరణలను ఆచరణలోకి తీసుకు వచ్చినవారే ఉన్నతశిఖరాలకు చేరుకున్నారన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కె.వి.స్వామి, స్కిల్ డవలప్‌మెంట్ కోఆర్డినేటర్ బి.జగన్మోహనరెడ్డి. విశ్వవిద్యాలయ అధికార్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### టోసిక్ ప్రిజం కార్యక్రమం

జేఎన్టీయూకే,ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): వర్సిటీలోని అలూమ్ని ఆడిటోరియంలో యూసీఈకే ఆధ్వర్యంలో సోమవారం టోసిక్ ప్రిజం కార్యక్రమాన్ని నిర్వహించారు. టోసిక్ ప్రిజం సమన్వయకర్త పి.జ్యోత్స్న ప్రధానవక్తగా హాజరై విద్యార్థులకు టోసిక్ ప్రిజం లక్ష్యాలు, అవకాశాలు గురించి వివరించారు. ప్రిజం పథకం సృజనాత్మక ఆలోచనలున్న వ్యక్తులకు, వారి ఆలోచనలకు వ్యాపారాత్మక మోడళ్లుగా మార్చుకునేందుకు అవసరమైన సహాయాన్ని అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మోహన్‌రావు, వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఏపీకి ఆన్‌షోర్- ఆఫ్‌షోర్ ప్రాజెక్టుల్లో రూ.1.61 లక్షల కోట్ల పెట్టుబడులు

● రాజ్యసభలో సతీష్‌బాబు ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానం


రాజ్యసభలో మాట్లాడుతున్న ఎంపీ సతీష్‌బాబు

కాకినాడసిటీ, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌కు ఆన్‌షోర్-ఆఫ్‌షోర్ ప్రాజెక్టుల్లో 19.25 బిలియన్ అమెరికన్ డాలర్లు (రూ.1.61లక్షల కోట్లు) పెట్టుబడులు వచ్చాయని రాజ్యసభలో ఎంపీ సతీష్‌బాబు అడిగిన ప్రశ్నకు కేంద్ర పెట్రోలియం, నాచురల్ గ్యాస్ శాఖ మంత్రి సురేష్ గోపి సమాధానమిచ్చారు అంధ్రప్రదేశ్‌లో కృష్ణా-గోదావరి బేసిన్ సహా పలు ఆన్‌షోర్-ఆఫ్‌షోర్ ఆయిల్, గ్యాస్ అన్వేషణ, ఉత్పత్తి ప్రాజెక్టులు కొనసాగుతున్నాయని మంత్రి తెలిపారు. ముఖ్యంగా కేజీ-డీడబ్ల్యు ఎన్-98/2 క్లస్టర్-టు ప్రాజెక్టు దాదాపు పూర్తయి భారీస్థాయిలో ఆయిల్, గ్యాస్ ఉత్పత్తి సామర్థ్యం కలిగి ఉందని వివరించారు. అంధ్రప్రదేశ్‌లో ఇప్పటివరకు ఆన్‌షోర్ ప్రాజెక్టుల్లో యుఎస్‌డీ 265.67 మిలియన్, ఆఫ్‌షోర్ ప్రాజెక్టుల్లో యుఎస్‌డీ 18,979.14 మిలియన్ పెట్టుబడులు జాయింట్ వెంచర్స్ రూపంలో వచ్చాయని తెలిపారు. మొత్తంగా యుఎస్‌డీ 19.25 బిలియన్ (రూ.1.61లక్షల కోట్లు) పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చినట్లు వెల్లడించారు. ఈ రంగంలో పెట్టుబడులు ఆకర్షించడానికి, ఉత్పత్తి వేగవంతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం పలు సంస్కరణలు చేపట్టినట్లు మంత్రి వివరించారని ఎంపీ క్యాంపు కార్యాలయం నుంచి వచ్చిన ప్రకటనలో తెలిపారు.

### మంత్రి లోకేష్ ఆధ్వర్యంలో

అలాగే రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో ఢిల్లీ పర్యటనలో రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు సహా పలువురు ఎంపీలు కేంద్ర మంత్రులు కేంద్ర ఎరువులు- రసాయనాలశాఖ మంత్రి జేపీ నడ్డాను, కేంద్ర రహదారి రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ, కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడులను ఎంపీలు కలిశారు. అలాగే కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్‌డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా మహారాష్ట్ర గవర్నర్ చంద్రపురం పొన్నుస్వామి రాధాకృష్ణన్‌ను టీడీపీ రాజ్యసభ సభ్యులు సానా సతీష్ మర్యాదపూర్వకంగా కలిశారు.

## దుర్గాభాయ్ దేశ్‌ముఖ్ పురస్కార ప్రదానోత్సవం

●డాక్టర్ చిరంజీవినీ కుమారికి మరణానంతరం పురస్కారం ప్రదానం


చిరంజీవినీకుమారి కుమారులకు పురస్కారాన్ని అందజేస్తున్న డాక్టర్ భారతలక్ష్మి

కాకినాడరూరల్, ఆగస్టు18(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధురాలు పద్మవిభూషణ్ డాక్టర్ దుర్గాభాయ్‌దేశ్‌ముఖ్ పురస్కార ప్రదానోత్సవంను సోమవారం ఇంద్రపాలెం లాకుల వద్దగల ఐడియల్ డిగ్రీకళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. అఖిలభారత మహిళాసమాఖ్య నెలకొల్పిన ఈ పురస్కారాన్ని విద్యావేత్త, మహిళాసమాఖ్య పూర్వఅధ్యక్షురాలు డాక్టర్ పి.చిరంజీవినీకుమారి మహిళాసాధికారత రంగంలో చేసిన కృషికి గుర్తింపుగా మరణానంతరం ఈ అవార్డును ఆమెకు ప్రదానం చేశారు. సమాఖ్య అధ్యక్షురాలు డాక్టర్ భారతలక్ష్మి చేతులమీదుగా చిరంజీవినీకుమారి కుమారులు డాక్టర్ పి.గోపాల్, ఐడియల్ కళాశాలల కార్యదర్శి, కరస్పాండెంట్ పీఎస్ఎస్ కిరణ్ తల్లి తరపున పురస్కారాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో కేఎస్‌పీఎల్ డైరెక్టర్ ఎం.మురళీధర్, డాక్టర్ ఆలపాటి శ్రీనివాస్, డాక్టర్ రత్నగిరి ఉష, డాక్టర్ చందన, రాధికా కృపలాని, ప్రిన్సిపాల్ డాక్టర్ టి.సత్యనారాయణ, మీనాక్షి, పద్మజ, దుర్గాంబ, శ్రీదేవి, భానుమతి పాల్గొన్నారు.

## వారాహి అమ్మవారి ఆలయాన్ని గ్రామస్థులకే అప్పగించాలి

● కాకినాడ కలెక్టరేట్ ఎదుట నిరసన

కలెక్టరేట్(కాకినాడ),ఆగస్టు18(ఆంధ్రజ్యోతి): దేవదాయశాఖ స్వాధీనం చేసుకున్న కాకినాడరూరల్ కొవ్వూరులో వారాహి అమ్మవారి ఆలయ నిర్వహణ గ్రామస్థులకే అప్పగించాలని కాకినాడ కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా చేశారు. ఈమేరకు కాళ్ల వీరభద్రరావు కుమార్తె పద్మ లక్ష్మీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కొంతమంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆలయాన్ని దేవదాయశాఖ స్వాధీనం చేసుకుందన్నారు. దీన్ని తిరిగి తామే నిర్వహించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌కు వినతిపత్రం ఇచ్చారు. అలాగే గ్రామస్థులకే వారాహి అమ్మవారి గుడి నిర్వహించే అధికారం ఇవ్వాలని గ్రామ ప్రజలు ఒక తీర్మానాన్ని చేశారు.

## స్వచ్ఛభారత్ మిషన్ అర్బన్ 2.0 ఎక్స్‌పోజర్ స్టడీ టూర్‌కి కాకినాడ హెల్త్ ఆఫీసర్ ఎంపిక


హెల్త్ ఆఫీసర్ డాక్టర్ డి.పృధ్వి చరణ్

కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్వచ్ఛభారత్ మిషన్-అర్బన్ 2.0సర్క్యులర్ ఎకానమీ దృష్టిలో భాగంగా ఘన వ్యర్థాల నిర్వహణ (ఎస్‌డబ్ల్యుఎం) కార్యక్రమాలను మరింత బలోపేతం చేసేందుకు ఈనెల 19 నుంచి 23 వరకు ఎక్స్‌పోజర్ స్టడీ టూర్ నిర్వహించనుంది. ఈ టూర్‌లో పాల్గొనడానికి కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృధ్విచరణ్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. రాజస్థాన్‌లో మూడురోజులపాటు జరిగే ఈ స్టడీ టూర్‌లో తడి, పొడి వ్యర్థాల ప్రాసెసింగ్ యూనిట్లు, సీబీజీ ప్లాంట్లు, సిఅండ్‌సి వ్యర్థాల ప్లాంటు, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ, అలాగే ఈ వేస్ట్, స్లాటర్ వ్యర్థాలు, కోడి వ్యర్థాల ప్రాసెసింగ్ సౌకర్యాలను పరిశీలించనున్నారు. ఇతర రాష్ట్రాల యూఎల్‌బీల సౌకర్యాలను సందర్శించి స్థానిక అధికారులతో సమావేశమై వివిధ సామర్థ్యాల ప్లాంట్లను అధ్యయనం చేసి ఆంధ్రప్రదేశ్‌లో అమలుచేయదగిన ఉత్తమ పద్ధతులపై వివరణాత్మక నివేదిక సిద్ధం చేశారు.

## సమాజాభివృద్ధిలో కార్పొరేట్ సంస్థలు భాగస్వామ్యం కావాలి

● ఓఎన్జీసీ ఉన్నతాధికార్లతో భేటీ

● రాష్ట్ర కార్మికశాఖ మంత్రి సుభాష్

రాజమహేంద్రవరం,ఆగస్టు18(ఆంధ్రజ్యోతి) సమాజాభివృద్ధిలో కార్పొరేట్ సంస్థల భాగస్వామ్యం అవసరమని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాస్ తెలిపారు. స్థానిక ఓఎన్జీసీ బేస్ కాంప్లెక్స్‌లో సోమవారం ఆయన అసెట్ మేనేజర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.ముఖర్జీ, సీజీఎం రామారావు, డైరెక్టర్ అజిత్‌సింగ్‌లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఓఎన్జీసీ పరితీరును అడిగి తెలుసుకోడంతో పాటు సీఎస్ఆర్ ఫండ్స్ వినియోగం గురించి ఆరా తీశారు. రామచంద్రపురం నియోజకవర్గంలో సుమారు రూ.2కోట్ల వరకూ సీఎస్ఆర్ నిధులలో కొన్ని పనులు ప్రతిపాదించినట్టు దానికి ఓఎన్జీసీ సహకారం అందించాలని కోరారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, వృత్తినైపుణ్య శిక్షణ ఇవ్వడానికి ఇంటర్న్‌షిప్ అవకాశం ఇవ్వాలని సూచించారు. ఓఎన్జీసీ ఈడీ ముఖర్జీ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధిలో తమవంతు పాత్ర పోషిస్తున్నామని, ప్రభుత్వానికి తమ సంపూర్ణ సహకారం ఉంటుందని చెప్పారు. రాష్ట్ర మంత్రిగానే కాకుండా వ్యక్తి గతంగా పలు సేవా కార్యక్రమాలు మంత్రి నిర్వహించడం పట్ల అధికారులు అయనను అభినందించారు. మొదట పుష్పగుచ్ఛం ఇచ్చిన మంత్రి సుభాష్‌కు స్వాగతం పలికారు.


పుష్పగుచ్ఛం ఇస్తున్న మంత్రి సుభాష్‌కు స్వాగతం పలుకుతున్న ఓఎన్జీసీ ఈడీ ముఖర్జీ

## రమాదేవి సిద్ధాంత వ్యాసానికి పీహెచ్‌డీ



జేఎన్టీయూకే, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): పరిశీలకుల బృందం సిఫార్సు మేరకు గుత్తా రమాదేవి సిద్ధాంత వ్యాసానికి పీహెచ్‌డీగా జేఎన్టీయూకే ఆమోద ముద్ర లభించింది. ఇన్వెస్టిగేషన్ ఆన్ బయోలాజికల్ యాక్టివిటీస్ ఆఫ్ పాలియజోల్ ట్రాన్సిషన్ మెటల్ కాంప్లెక్సెస్ అనే అంశంపై ఆమె తన సిద్ధాంత వ్యాసాన్ని విజయనగరంలోని ఎంవీజీఆర్ ఇంజనీరింగ్ కళాశాల రసాయన శాస్త్రం విభాగం అసోషియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అబ్దుల్ రజాక్ పర్యవేక్షణలో సమర్పించారు. రమాదేవికి డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ అవార్డు రసాయన శాస్త్రంలో చేసిన పరిశోధనకు గానూ లభించింది.

## 21న వీరేశ్వరస్వామికి లక్ష రుద్రాక్ష పూజ

ఐ.పోలవరం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మురమళ్ళ శ్రీభద్రకాళీసమేతవీరేశ్వరస్వామికి ఈనెల21న శ్రావణ బహుళ త్రయోదశి గురువారం సందర్భంగా లక్ష రుద్రాక్ష పూజ నిర్వహించనున్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రం కాశీ నుంచి తీసుకొచ్చిన రుద్రాక్షలతో స్వామికి లక్ష రుద్రాక్షార్చన, అమ్మవారికి కుంకుమ పూజ నిర్వహిస్తారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు దంపతులు పాల్గొననున్నారు. ఈపూజలో పాల్గొనదలచిన వారు రూ.250 చెల్లించి టిక్కెట్ తీసుకోవాలని ఆలయ అధికారులు తెలిపారు. పూజలో పాల్గొన్న భక్తులకు ఈనెల22న దేవాలయంలో రుద్రాక్షల ప్రసాదం అందిస్తారు. పూజ ఏర్పాట్లను ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ పర్యవేక్షిస్తున్నారు.

## వారాహి అమ్మవారి ఆలయ ఆదాయం లెక్కింపు

కాకినాడరూరల్, ఆగస్టు18(ఆంధ్రజ్యోతి): రూరల్‌మండలం కొవ్వూరులోని దేవదాయ ధర్మదాయశాఖ పరిధిలోగల శ్రీ వారాహి అమ్మవారి ఆలయ శని, ఆదివారాలకు సంబంధించిన ఆదాయాన్ని ఇన్‌ఛార్జి ఈవో ఆర్.సౌజన్య ఆధ్వర్యంలో రూరల్ మండలం జనసేన అధ్యక్షుడు కరెడ్ల గోవిందు పర్యవేక్షణలో సోమవారం సాయంత్రం లెక్కించారు. మొత్తం ఆదాయం రూ.1,16,140 వచ్చిందని ఈవో తెలిపారు. ఈకార్యక్రమంలో బుజ్జి, సతీష్, చిన్నీ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# వరద ఉధృతి

- ఎడతెరిపి లేకుండా వర్షాలు
- ఏజెన్సీలో నిండు కుండల్లా వాగులు
- జల దిగ్బంధంలో 16 గ్రామాలు
- నాటు పడవలపై ప్రయాణాలు
- పరిస్థితిని సమీక్షిస్తున్న పీవో, ఏఎస్పీలు

చింతూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఎగువ రాష్ట్రాలు ఛత్తీస్‌గఢ్, ఒడిస్సాలో మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. దీంతో అల్లూరి జిల్లా చింతూరులో శబరి, సీలేరు నదులు ఉధృతం ప్రవహిస్తున్నాయి. కూనవరం వద్ద గోదావరి ఎగ పోటుతో సోమవారం వాగులు, వంకలు నిండు కుండల్లా దర్శనమించాయి. దీంతో ఏపీ మీదుగా ఒడిస్సా వెళ్లే 326 జాతీయ రహదారిపై చింతూరు కుయుగూరుల వద్ద వరద నీరు భారీగా చేరింది. చింతూరు నుంచి భద్రాచలం వెళ్లే 30వ నెంబరు జాతీయ రహదారిపై వరద నీరు భారీగా ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంలో 326వ నంబరు జాతీయ రహదారిపై పూర్తిగా రాకపోకలు నిలిచిపోగా 30వ నంబరు జాతీయ రహదారిపై సాహసించి రాకపోకలు సాగిస్తున్నారు. చింతూరు, వరరామచంద్ర పురం మండలాల నడుమ సోకిలేరు, చీకటి వాగులు పొంగి పొర్లుతున్నాయి. దీంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. చింతూరు మండలంలో 16గ్రామాలు జలదిగ్బంధం అయ్యాయి. దీంతో ప్రజలు నాటు పడవలపై ప్రయాణాలు సాగిస్తున్నారు. సోమవారం సాయంత్రం భద్రాచలం వద్ద గోదావరి 38.20 అడుగులు, కూనవరం వద్ద గోదా వరి 32, చింతూరు వద్ద శబరి 33 అడుగుల మేర ప్రవహి స్తున్నాయి. వరద పరిస్థితిని చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్, ఏఎస్పీ పంకజ్ కుమార్ మీనా సమీక్షిస్తున్నారు. వాగులపై ప్రయాణించవద్దని ప్రజలకు సూచించారు. చింతూరు డివిజన్ వ్యాప్తంగా లోతట్టు ప్రాంతాలకు చెందిన 16మంది గర్భిణులను ఆసుపత్రులకు తరలించినట్టు డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌వో డాక్టర్ పుల్లయ్య 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.



చింతూరు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న శబరి నది



సోకిలేరు వాగు ఉధృతిని పరిశీలిస్తున్న చింతూరు ఐటీడీఏ పీవో, ఏఎస్పీ



సోకిలేరు వాగుపై నాటు పడవలో గర్భిణుల ప్రయాణం

## వరద నీటిలోనే గండిపోశమ్మ ఆలయం

దేవీపట్నం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా దేవీపట్నం మండలంలో 2 రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా వర్షాలు కురవడంతో జనజీవనం స్తంభించింది. వ్యాపారులు, రైతు కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల సమీపంలో ఉన్న వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. దీనికి తోడు గోదావరి ఉగ్రరూపం దాల్చడంతో గోదావరి పరీవాహక ప్రాంతాలైన కొండ మొదలు నుంచి పోశమ్మగండి వరకు గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. మాతృశ్రీ గండిపోశమ్మ అమ్మవారి ఆలయం వరద నీటిలోనే ఉంది. దండంగి-రావిలంక ప్రధాన రోడ్డుపై భారీగా వరద నీరు చేరుకుంది.



దేవీపట్నంలో ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి



గండిపోశమ్మ ఆలయం

# గోదావరి పరవళ్లు

## కాటన్ బ్యారేజ్ నుంచి 6,07,682 క్యూసెక్కులు సముద్రంలోకి విడుదల



పుష్కర్‌ఘాట్ వద్ద గోదావరి నీటిమట్టం



ధవళేశ్వరంలో కాటన్ బ్యారేజ్ గేట్ల ద్వారా ప్రవహిస్తున్న వరద నీరు

ధవళేశ్వరం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహంతో తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం వద్ద గోదావరి పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తోంది. సోమవారం ఉదయం 4.38లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి విడుదల చేయగా సాయంత్రానికి కాటన్ బ్యారేజ్ మొత్తం గేట్లను పూర్తిగా ఎత్తివేసి ఎగువ నుంచి వస్తున్న ప్రవాహాన్ని వచ్చింది వచ్చినట్టే దిగువకు వదిలివేస్తున్నారు. సోమవారం సాయంత్రానికి కాటన్ బ్యారేజ్ ద్వారా 6,07,682 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తోంది. దీంతో ధవళేశ్వరం వద్ద గోదావరి నీటి మట్టం 9.10 అడుగులుగా నమోదయింది. కాగా ఎగువన భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం పెరుగుదల నెమ్మదించి సాయంత్రానికి 37.70 అడుగులకు చేరుకుంది. ఎగువన కాళేశ్వరం, పేరూరు, దుమ్ముగూడెం వద్ద నీటి మట్టం తగ్గుముఖం పట్టింది.

### ఆల్ క్లియర్ పొజిషన్ ఎందుకు?

ఎగువ నుంచి భారీగా వరద ప్రవాహం వస్తున్న సమయంలోనే మొత్తం కాటన్ బ్యారేజ్ గేట్లను పూర్తిగా ఎత్తివేసి (ఆల్ క్లియర్ పొజిషన్) వచ్చిన ప్రవాహాన్ని వచ్చినట్టు దిగువకు వదిలి వేస్తూ ఉంటారు. ప్రస్తుతం అటువంటి పరిస్థితి లేకుండానే ఆల్ క్లియర్ పొజిషన్‌లో కాటన్ బ్యారేజ్ గేట్లు ఎత్తి వరద నీటిని సముద్రంలోకి వదిలి వేయాల్సిన పరిస్థితి ఏమిటో అధికారులకే తెలియాలి.



గొల్లప్రోలు పట్టణ శివారు రహదారి, పంటపొలాలను ముంచెత్తిన సుద్దగడ్డ వరద నీరు

## సుద్దగడ్డ, చౌటుకాలువలకు పోటెత్తిన వరద

గొల్లప్రోలు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలులో సుద్దగడ్డ, చౌటుకాలువలకు వచ్చిన వరద ఉధృత రూపం దాల్చింది. పంటపొలాలు, రహదారులను వరద నీరు ముంచెత్తింది. రెండు వేల ఎకరాల్లో వరి, పత్తి పంటకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. ఇది మరింతగా పెరిగే అవకాశం ఉంది. గొల్లప్రోలు వద్ద గల సుద్దగడ్డ(కొండ)కాలువ, చెందుర్తి సెంటర్ వద్ద గల చౌటు కాలువలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. గొల్లప్రోలు పట్టణ శివారు కొత్తకాలనీకి వెళ్లే రహదారి పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కుకుంది. వరద నీటిలో నుంచే ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. వరదల కారణంగా తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు నిచ్చెనపై నుంచి నిర్మాణంలో ఉన్న బ్రిడ్జిని దాటి వెళ్లి తాగునీరు తెచ్చుకుంటున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకూ సుద్దగడ్డ, చౌటు కాలువల వరద ఉధృతి పెరుగుతూనే ఉండడం ఆందోళన కలిగిస్తోంది. వరదల కారణంగా గొల్లప్రోలు, సీతానగరం, లక్ష్మీపురం, చేబ్రోలు, చెందుర్తి, తాటిపర్తి, చినజగ్గంపేట తదితర ప్రాంతాల్లో 3వేల ఎకరాలకుపైగా వరి, పత్తి, కాయగూరలు తదితర పంటలు ముంపునకు గురయ్యాయి. ఇందులో 2 వేల ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయాధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఇది మరింతగా పెరిగే అవకాశం ఉందని వారు అభిప్రాయపడ్డారు.

### 2వేల ఎకరాల్లో వరి, పత్తి పంటలకు నష్టం

### రహదారులపై వరద నీరు

సుద్దగడ్డ, చౌటుకాలువలకు వరదతో గొల్లప్రోలు-తాటిపర్తి, చెందుర్తి-తాటిపర్తి, ఎన్‌హెచ్216-చెందుర్తి, చేబ్రోలు-మల్లవరం, గొల్లప్రోలు శివాలయం మాన్యం రహదారులపై నీరు ప్రవహిస్తోంది. నీటి ఉధృతితో గొల్లప్రోలు-తాటిపర్తి పంచాయతీరాజ్ రహదారిపై రాకపోకలు నిలిపివేశారు.

### నాయకులు, అధికారుల పర్యటన

సుద్దగడ్డ వరద కారణంగా గొల్లప్రోలు కొత్తకాలనీ వద్ద గల పరిస్థితిని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, కాకినాడ ఆర్డీవో మల్లిబాబు తదితరులు పరిశీలించారు. ముంపు బాధితులను అన్ని విధాల ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ముంపు ప్రాంతాల్లో గొల్లప్రోలు తహశీల్దారు గోపాలకృష్ణ, పిఠాపురం సీఐ శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్‌ఐ రామకృష్ణ తదితరులు పర్యటించారు.

## వీధి కుక్కల దాడిలో పదేళ్ల బాలుడికి గాయాలు

### అనపర్తిలో ఘటన



గాయపడ్డ బాలుడు సాత్విక్

అనపర్తి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా అనపర్తి తహశీల్దార్ కార్యాలయ సమీపంలో సోమవారం మధ్యాహ్నం వీధి కుక్కల దాడిలో సాత్విక్ (10) తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం పాఠశాలలకు సెలవు కావడంతో స్నేహితులతో బయటకు వచ్చిన సాత్విక్‌పై వీధి కుక్కలు ఒక్కసారిగా దాడికి పాల్పడ్డాయి. సాత్విక్ కేకలు వేయడంతో స్థానికులు కుక్కలను చెదరగొట్టడంతో బాలుడికి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. దీంతో వెంటనే చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్యం అందించారు.

## అటవీశాఖ బీట్ ఆఫీసర్ సస్పెన్షన్

దేవీపట్నం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా దేవీపట్నం మండలంలో దేవారం అటవీశాఖ బీట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న మహిళా ఉద్యోగిని సోమవారం సస్పెండ్ చేసినట్టు ఇందుకూరు రేంజ్ అధికారి కొండలరావు తెలిపారు. ఇటీవల కలప వ్యాపారుల వద్ద లంచం తీసుకుంటూ మీడియా కంటపడడంతో ఈ విషయం సోషల్ మీడియాలో హల్‌చల్ అయింది. దీంతో సీరియస్ అయిన ఉన్నతాధికారులు విచారణ నిర్వహించి ఆఫీసర్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.



## చించినాడ-దిండి వంతెన మరమ్మతులు ప్రారంభం





చించినాడ-దిండి వంతెన మరమ్మతుల్లో నిమగ్నమైన సిబ్బంది, నిలిచిపోయిన కళాశాలల బస్సులు

మలికిపురం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): చించినాడ-దిండి వద్ద వశిష్ట నదిపై 2 దశాబ్దాల క్రితం నిర్మించిన వంతెన మరమ్మతులను సోమవారం ప్రారంభించారు. ఉదయం నుంచి వంతెనపై రాకపోకలు పూర్తిగా నిలిపివేస్తామని ముందస్తుగా ప్రకటించారు. అయితే భారీ వర్షం కురవడంతో మధ్యాహ్నం వరకు పనుల జోలికి వెళ్లలేదు. మధ్యాహ్నం 2 గంటల నుంచి వంతెనకు ఇరువైపులా పాదచారులను సైతం నిలిపివేశారు. నదిలో వంతెనకు సంబంధించిన 14 పిల్లర్ బేరింగులను కొలతలు వేసే పని చేపట్టారు. పార్ట్ పీటీఎఫ్ బేరింగులు అమర్చవలసి ఉందని ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. సుమారు 150 మంది వరకు పనులు చేస్తున్నట్టు చెప్పారు. సిబ్బంది వంతెన పియర్స్‌ను పైకి ఎత్తి తద్వారా కొలతలు సేకరించి తదుపరి బేరింగులు అమరుస్తామని తెలిపారు. మళ్లీ గురువారం వంతెనపై రాకపోకలు పూర్తిగా నిలిపివేస్తామన్నారు. వంతెనపై మోటారుసైకిళ్లు, పాదచారులు, చిన్నవాహనాలను నిలిపివేయడంతో వందలాది ప్రయాణికులు వంతెన వద్దకు వచ్చి తిరిగి వెళ్తున్నారు. హైవే సిబ్బంది ఇరువైపులా ఎటువంటి వాహనాలు రాకుండా కట్టుదిట్టమైన చర్యలు ఏర్పాటు చేశారు. త్వరితగతిన మరమ్మతులు పూర్తి చేసి వంతెనను అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

## పెళ్లై మూడు నెలలు కాకుండానే.. యువకుడి ఆత్మహత్య

### కోనసీమ జిల్లా మోదుకూరులో సంఘటన

ఆలమూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మోదుకూరులో యువకుడు ఉరిపోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆలమూరు ఎస్‌ఐ జి.నరేష్ తెలిపిన వివరాల ప్రకారం... తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం చిన్నాయిగూడెం గ్రామానికి చెందిన లింగం శేషు (25) ఆలమూరు మండలం మోదుకూరు గ్రామానికి చెందిన గుంటూరి సుశీల ప్రేమించుకున్నారు. వారి వివాహానికి శేషు తల్లిదండ్రులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో మే 29న వివాహం చేసుకుని మోదుకూరులో సుశీల ఇంటికి వచ్చారు. మోదుకూరులో మరో ఇంట్లో కాపురం ఉంటున్నారు. ఆదివారం మధ్యాహ్నం సుశీల, శేషు చర్చికి వెళ్లి ఇంటికి వచ్చారు. అనంతరం సాయంత్రం శేషు ఇంట్లోని ఫ్యాన్‌కి ఉరిపోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు భార్య సుశీల ఫిర్యాదు చేసినట్టు ఎస్‌ఐ నరేష్ తెలిపారు. కేసు నమోదు చేసి సోమవారం మృతదేహానికి శవపరీక్ష నిర్వహించి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.



లింగాల శేషు (ఫైల్)

### చిన్నాయిగూడెంలో విషాదఛాయలు

దేవరపల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): యువకుడి మృతితో తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం చిన్నాయిగూడెంలో విషాదఛాయలు అలముకున్నాయి. గ్రామానికి చెందిన లింగాల రాము, సుబ్బలక్ష్మి దంపతుల కుమారుడు శేషు మృతిచెందడంతో తల్లిదండ్రులు విలపిస్తున్నారు. వారు మాట్లాడుతూ తమ కుమారుడు శేషు ఆత్మహత్య చేసు కునేంత పిరికివాడు కాదని, దీనిపై పూర్తి విచారణ చేసి న్యాయం చేయాలని కోరుతున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం చిన్నాయిగూడెం తీసుకొచ్చారు.

## పంటకాల్వలోకి ఒరిగిన ఓఎన్జీసీ ఆయిల్ ట్యాంకర్



ఎస్.యానాం సమీపంలో ప్రధాన పంటకాల్వలోకి ఒరిగిన ఆయిల్ ట్యాంకర్

ఉప్పలగుప్తం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్.యానాం సమీపంలోని జల్లివారిపేట సమీపంలో సోమవారం ఉదయం ఓఎన్జీసీ ఆయిల్ ట్యాంకర్ పంటకాల్వలోకి ఒరిగింది. ట్రాక్టర్‌ను తప్పించే సమయంలో ఈ ప్రమాదం జరిగినట్టు స్థానికులు చెప్తున్నారు. ట్యాంకర్ జల్లివారిపేట అన్‌లోడింగ్ పాయింట్‌కు వస్తుండగా ఈ సం ఘటన జరిగింది. ట్యాంకర్‌లో పూర్తిస్థాయిలో క్రూడాయిల్ ఉండడంతో ట్యాంకర్‌ను యథాస్థితికి తెచ్చేందుకు సాయంత్రం వరకు వేచిచూడాల్సి వచ్చింది. రోజంతా ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడ్డాయి. వాహనాలను చల్లపల్లి- ఎస్.యానాం బైపాస్ రహదారికి మళ్లించారు. ట్యాంకర్‌లోని క్రూడాయిల్‌ను అన్‌లోడ్ చేసేందుకు సాయంత్రం నుంచి చర్యలు ప్రారంభమయ్యాయి.

## ఫెయిల్ అయ్యాడని తండ్రి మందలింపు.. ఉరివేసుకున్న ఇంజనీరింగ్ విద్యార్థి

రాయవరం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్‌లో సబ్జెక్టులో ఫెయిల్ అయిన కారణంగా తండ్రి మందలించాడనే కోపంతో విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం పసలపూడి గ్రామంలో జరిగింది. సోమవారం రాయవరం ఎస్‌ఐ డి.సురేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం... కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పటవల గ్రామానికి చెందిన దంగేటి వెంకటరమణ(19) పసలపూడిలో తన అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటూ రామచంద్రపురంలో ఒక ప్రైవేటు కళాశాలలో ఇంజనీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. బీటెక్ మొదటి సంవత్సరంలో కొన్ని సబ్జెక్టుల్లో ఫెయిల్ కావడంతో తండ్రి మందలించాడనే కోపంతో పసలపూడి అమ్మమ్మ ఇంటికి తిరిగి వచ్చి వెదురుపాక-పసలపూడి రోడ్డులో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి దంగేటి భద్రం ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

## నకిలీ కరెన్సీ తయారీ కేసులో ముగ్గురికి యావజ్జీవం

కొవ్వూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): నకిలీ కరెన్సీ తయారు చేసిన కేసులో ముగ్గురు నిందితులకు ప్రిన్సిపల్ సీనియర్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి జీవీఎల్ సరస్వతి యావజ్జీవ (14 సంవత్సరాల జైలు) శిక్ష, రూ.10 వేలు జరిమానా విధించినట్టు కొవ్వూరు రూరల్ ఎస్‌ఐ కె.శ్రీహరిరావు సోమవారం తెలిపారు. వివరాల ప్రకారం.. 2013లో తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం ఐ.పంగిడి గ్రామంలో నకిలీ కరెన్సీ తయారుచేస్తుండగా అప్పటి ఎస్‌ఐ ఎం.అర్జునరాజు దాడి చేసి పంగిడికి చెందిన చదలవాడ అనీల్‌కుమార్, తాడి వెంకటరెడ్డి, నర్సీపట్నంకు చెందిన తోమండ్ర రంజిత్‌సింగ్, ఏలూరుకు చెందిన ఎల్లంపల్లి శ్రీనివాసరావు, తిగిరిపల్లి వెంకటేశ్వరరావు, మండా నాగిరెడ్డిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. కేసు విచారణలో జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ పర్యవేక్షణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కోర్టు మోనిటరింగ్ టీం డీఎస్పీ జి.దేవకుమార్, రూరల్ సీఐ కె.విజయ్‌బాబు ఆధ్వర్యంలో ఎస్‌ఐ కె.శ్రీహరిరావు, కోర్టు కానిస్టేబుళ్లు భవానిప్రసాద్, మేఘనాథం సహకరించగా ప్రాసిక్యూషన్ తరపున పీపీ వెంకటరమణ వాదనలు వినిపించారు. నేరం రుజువు కావడంతో అనీల్‌కుమార్, రంజిత్‌సింగ్, ఎల్లంపల్లి శ్రీనివాసరావుకు ఒక్కొక్కరికి 14 ఏళ్ల జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ జడ్జి సరస్వతి తీర్పునిచ్చారు. తాడి వెంకటరెడ్డి, తిగిరిపల్లి వెంకటేశ్వరరావు, మండా నాగిరెడ్డి మృతిచెందినట్టు ఎస్‌ఐ తెలిపారు.

## వివాహిత ఆత్మహత్యాయత్నం

### కాపాడిన సామర్లకోట ట్రాఫిక్ పోలీసులు

సామర్లకోట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట అయిదు తూములు సమీపాన రైలు పట్టాలపై ఆత్మహత్యకు యత్నించిన వివాహితను ట్రాఫిక్ పోలీసులు కాపాడి కుటుంబ సభ్యులకు క్షేమంగా అప్పగించారు. సామర్లకోట జగ్గమ్మగారిపేటకు చెందిన పోలవరపు నూకరత్నానికి తునికి చెందిన దుర్గాప్రసాద్‌తో వివాహం కాగా తన భర్త తనను సరిగా చూసుకోకపోవడమే గాకుండా తరచూ వేధింపులకు పాల్పడుతుండడంతో సామర్లకోటలో ఉన్న తన సవతి తల్లి వద్ద సోమవారం తనగోడు విన్న వించుకున్నప్పటికీ పెడచెవిన పెట్టింది. దీంతో తన గోడు ఎవరికి చెప్పుకున్నా ఫలితం ఉండదని భావించి జీవితంపై విరక్తి చెంది నూకరత్నం రైలు పట్టాల వద్దకు చేరింది. అదే సమయంలో కాకినాడ రోడ్డులో గుంతలు పూడ్చేందుకు ట్రాఫిక్ ఎస్‌ఐ అడపా గరగారావు సిబ్బంది సన్యాసిరావు, ఈశ్వరరావు, రంగారావుతో కలిసి పనులు చేస్తూ పట్టాలపై మహిళ అనుమానాస్పదంగా ఉండడాన్ని గుర్తించి హుటాహుటిన చేరకుని రైలు పట్టాల వద్ద నుంచి రోడ్డుపైకి తీసు కొచ్చారు. ఆమెను విచారించగా భర్త వేధింపులు, సవతి తల్లి వివక్షతతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యా యత్నానికి నిర్ణయించుకున్నట్లు వివరించింది. చావే సమస్యలకు పరిష్కారం కాదని పునరాలోచన చేయాలంటూ ఆమెకు ఎస్‌ఐ గరగారావు కౌన్సిలింగ్ ఇచ్చి మానసిక ధైర్యం కల్పించారు. కుటుంబసభ్యులను ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు రప్పించి వారికి కౌన్సిలింగ్ ఇచ్చి నూకరత్నాన్ని క్షేమంగా కుటుంబసభ్యులకు అప్పగించారు. ట్రాఫిక్ పోలీసుల కృషిని పలువురు అభినందించారు.



సామర్లకోటలో వివాహితను రక్షించి కౌన్సిలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ ఎస్‌ఐ గరగారావు

# అమలాపురం





### శ్రీకృష్ణ భగవానుని ఊరేగింపు

మామిడికుదురు, ఆగస్టు18(ఆంధ్రజ్యోతి): త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో శ్రీకృష్ణపరమాత్ముని ఊరేగింపు సోమవారం జరిగింది. ఆదుర్రులోని శ్రీవాసవికల్యాణ మండపం వద్ద శ్రీకృష్ణునికి ప్రతీరోజు వివిధరకాల పూజలు నిర్వహించారు. సోమవారం శ్రీకృష్ణుని ప్రతిమను ఆదుర్రు గ్రామంలో ఊరేగించారు.

### ఢిల్లీ సీఎంకు కొబ్బరి పీచు వినాయకుని ప్రతిమ బహూకరణ



మామిడికుదురు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): పాశర్లపూడికి చెందిన ఆక్సిజన్ అసోసియేషన్ సభ్యులు కొబ్బరి పీచుతో వివిధ రకాల వస్తువులను తయారు చేస్తున్నారు. ఢిల్లీ సీఎం రేఖా గుప్తాకు కొబ్బరి పీచుతో తయారుచేసిన గణపతి ప్రతిమను సోమవారం ఆక్సిజన్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు కటికిరెడ్డి గంగాధర్ అందించారు.

## కార్మికుల హక్కులను కాలరాస్తున్న లేబర్‌కోడ్‌లు

**సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు**



మాట్లాడుతున్న నర్సింగరావు

అమలాపురంటౌన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్‌లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకు వస్తున్నాయని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు ఆరోపించారు. హక్కుల పరిరక్షణకు కార్మికులందరినీ ఐక్యం చేసేందుకు సీఐటీయూ కృషి చేస్తుందన్నారు. అమలాపురం ఎంప్లాయిస్ హోంలో సోమవారం జిల్లాశాఖ అధ్యక్షుడు గుదే దుర్గాప్రసాద్ అధ్యక్షతన సీఐటీయూ జిల్లా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి నర్సింగరావులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. తొలుత జిల్లాలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలో నైట్ వాచ్‌మన్లగా పనిచేస్తోన్న వారికి ఆరు నెలలుగా జీతాలు చెల్లించలేదని వివరించారు. ఈవిషయంపై రాష్ట్ర అధికారులతో సంప్రదించామని నర్సింగరావు తెలిపారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును యథావిధిగా కొనసాగిస్తామని ఇచ్చిన హామీని ఇంతవరకు అమలు చేయలేదన్నారు. దీనిపై సెప్టెంబరు 15నచలో విజయవాడకు పిలుపు ఇచ్చామన్నారు. సీఐటీయూ ఆలిండియా మహాసభలు డిసెంబరు 31నుంచి 2026 జనవరి 4వరకు విశాఖపట్నంలో నిర్వహించనున్నట్టు ప్రకటించారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరామ్, కోశాధికారి కె.కృష్ణవేణి, ఉపాధ్యక్షులు భాస్కరరావు, బండి వెంకటలక్ష్మి, కార్యదర్శి మలక సుభాషిణి, ఆశా వర్కర్ల యూనియన్ జిల్లాఅధ్యక్షురాలు ఎస్తేరు రాణి, దైవకృప, ఈశ్వరి, రాంబాబు, విప్పర్తి మోహనరావు, పిండి కాళిదాసు పాల్గొన్నారు.

## ఓట్ చోర్‌పై కాంగ్రెస్ కొవ్వొత్తుల ర్యాలీ



అమలాపురంలో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అమలాపురం టౌన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఓటు దొంగలపై న్యాయ యుద్ధం పేరిట కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు సోమవారం రాత్రి అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ పార్టీ కోఆర్డినేటర్ అయితాబత్తుల సుభాషిణి ఆధ్వర్యంలో ఓట్ చోర్.. గడ్డి చోడ్ పేరిట ఫ్లెక్సీ చేతబూని ర్యాలీ నిర్వహించారు. ఓటు దొంగలను ఆధారాలతో సహా అగ్రనేత రాహుల్‌గాంధీ బయట పెట్టారని ఆమె వివరించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికల కమిషన్‌ను గుప్పిట్లో పెట్టుకుని అడ్డదారిలో అధికారంలోకి వస్తుందని రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొత్తూరి శ్రీనివాస్ విమర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ముషిణి రామకృష్ణారావు, యార్లగడ్డ రవీంద్ర, వంటెద్దు బాబి, మాచిరాజు శివన్నారాయణ, ఏలేశ్వరపు రాధాకృష్ణ, ములపర్తి మోహనరావు, సుగ్గు ప్రసాద్, ఈతకోట సోమరాజు, కుడుపూడి శ్రీనివాస్, పేరి శర్మ, మెహబూబ్ షకీలా, వస్కా బాబు, మొల్లేటి వెంకటేశ్వరరావు, అయితాబత్తుల కుమార్‌సింగ్ పాల్గొన్నారు.

### ఓట్ల అవకతవకలపై నిరసన

మామిడికుదురు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా ఓటర్ల జాబితాలో జరిగిన అవకతవకలపై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న పోరాటంలో భాగంగా సోమవారం నగరంలో కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేశారు. ఎలక్షన్ కమిషన్, బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఓట్ చోర్-గద్దీ చోడ్ అనే నినాదాలతో కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. కాంగ్రెస్ మండలశాఖ అధ్యక్షుడు అప్పన శ్రీరామకృష్ణ, కొండేటి వెంకటేశ్వరరావు, బత్తుల సురేష్‌బాబు, గెడ్డం వెంకటేశ్వరరావు, ఎం.రత్నం, బొంతు రాజేంద్రప్రసాద్, అడబాల రాము, వాణరాశి దుర్గారావు పాల్గొన్నారు.

### డ్రైనేజీలో పూడిక తీయాలి

**- త్యాగరాజవీధి ప్రజలు**

యానాం, ఆగస్టు18(ఆంధ్రజ్యోతి): యానాం ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిని ఆనుకుని ఉన్న త్యాగరాజవీధిలో డ్రైనేజీ అస్తవ్యస్తంగా ఉండటంతో పూడికలు తీయాలని స్థానిక గ్రామస్తులు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌ను కోరారు. దీంతో గ్రామస్తులతో కలిసి వాటిని పరిశీలించిన ఎమ్మెల్యే డ్రైనేజీ పూడికలు తీసి అభివృద్ధి పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. మున్సిపల్ కమిషనర్ బుద్ధి అఖిల్‌తో ఎమ్మెల్యే అశోక్ సమావేశమయ్యారు. యానాంలో కొంత కాలంగా ఎమ్మెల్యే నిధులు, సీఎస్ఆర్ నిధులతో చేపట్టే పనులపై అధికారుల నిర్లక్ష్యం వల్ల పనులు జరగడం లేదన్నారు. పలు గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం కోసం కోట్లాది రూపాయలతో వర్కులు ఎన్ఐటీ అనుమతి పొంది తీసుకువచ్చిన ఫైల్‌ను గతంలో మున్సిపల్ కమిషనర్‌కు అందజేశామన్నారు. ఆ పనులు ప్రారంభించాలని ఎమ్మెల్యే కోరారు.

### పైపులైన్ ఏర్పాటు నిర్ణయంపై హర్షం

యానాం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): యానాం శివారు సావిత్రినగర్‌లో డ్రైనేజీ పైపు లైన్లు తొలగించి కొత్త పైపులైన్ మంజూరుపై కాంగ్రెస్ పార్టీ హర్షవ్యక్తం చేసింది. పార్టీ అధ్యక్షుడు అర్ధాని దినేష్, కాటంశెట్టి రామ్మూర్తిలు మాట్లాడారు. కొన్నిఏళ్లుగా మంచినీటిలో డ్రైనేజీనీరు కలిసిపోవడంతో అనారోగ్యం పాలవుతున్న అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. నూతనంగా పైపులైన్ వేయడానికి నిర్ణయం తీసుకున్నందుకు ప్రభుత్వానికి కాంగ్రెస్ తరుపున కృతజ్ఞతలు తెలిపారు.

### నీట మునిగిన వరి.. శాస్త్రవేత్తల సూచనలు

కాట్రేనికోన, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): నీటి ముంపులో ఉన్న సార్వా వరిచేలకు తీసుకోవలసిన చర్యలపై శాస్త్రవేత్తలు ఎం.గిరిజారాణి, టి.శ్రీనివాస్ సూచించారు. వర్షాలకు వరి ఊడ్చిన దశ నుంచి పిలకల దశలో ముంపునకు గురికావడం జరిగింది. పంట ఊడ్చిన వెంటనే నీట మునిగి మొక్కలు చనిపోతే వెంటనే మనేదలు వేసుకోవాలి. పిలకల దశలో నీట మునిగితే వీలైనంత త్వరగా నీటిని తీసివేసి, ఎకరానికి 20కిలోల యూరియా, 10-15 కిలోల పొటాష్ అదనంగా వేసుకోవాలన్నారు. నీట మునిగిన వరి పొలాలు తిరిగి పుంజుకోవడానికి నీటిని బయటకు తీసివేసి ఎకరాకు 20కిలోల యూరియా, 15 కిలోల పొటాష్‌ను వేసుకోవాలన్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



చేపల మార్కెట్ ఏరియాలో సమస్యలను గుర్తిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం టౌన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): పట్టణాభివృద్ధిలో భాగంగా సోమవారం అమలాపురం పట్టణంలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు శంకుస్థాపనలు చేశారు. స్థానిక చేపల మార్కెట్‌లో రూ.34లక్షలతో నిర్మించే షెడ్డు ఆధునికీకరణ పనులకు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్, టీడీపీ పట్టణశాఖ అధ్యక్షుడు తిక్కిరెడ్డి నేతాజీ, కౌన్సిలర్లు బండారు గోవిందు, బొర్రా వెంకటేశ్వరరావు, యేడిద శ్రీను, భాస్కర్ల రామకృష్ణ, ఆర్డీఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. 27వ వార్డులో నూతనంగా నిర్మించిన యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు దున్నాల దుర్గ, వలవల శివరావు, పిండి రాజా, నల్లా సుబ్బారావు, గెల్లా మీనాకుమారి తదితరులు పాల్గొన్నారు. 29వ వార్డులో రూ.40లక్షలతో ఆధునికీకరించిన శ్మశానవాటిక పనులను ఎమ్మెల్యే ఆనందరావు పరిశీలించారు. కార్యక్రమంలో ఆవుపాటి గోపాల్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్సు హాలును ఎమ్మెల్యే ఆనందరావు ప్రారంభించారు. ఆశెట్టి సత్యనారాయణ-భారతమ్మ పేరిట కుమారుడు ఆశెట్టి నాగదుర్గ-ఆదిబాబు దంపతులు రూ.లక్ష విలువచేసే ఫ్రీజర్ బాక్సును ఎమ్మెల్యే సమక్షంలో అమలాపురం పురపాలక సంఘానికి అందజేశారు.

## కూటమి పాలనలోనే పల్లెల అభివృద్ధి: ఎమ్మెల్యే



ఐ.పోలవరంలో సీసీ రోడ్డు ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బుచ్చిబాబు

ఐ.పోలవరం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలోనే పల్లెసీమలు అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందుతున్నాయని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. ఐ.పోలవరంలో సోమవారం పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. పెదమడిలో రూ.2.02కోట్లతో నిర్మించిన సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు. బాణాపురంలో రూ.16లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీకేంద్ర భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, గుత్తుల సాయి, నాగిడి నాగేశ్వరరావు, రాయపురెడ్డి రాజా, దాట్ల పృథ్వి, సాగిరాజు సూరిబాబురాజు, సొసైటీ అధ్యక్షుడు కాకర్లపూడి బుజ్జి, కాకర్లపూడి రాజేష్, చెల్లి అశోక్, దాట్ల వర్మ, నీటిసంఘం అధ్యక్షుడు రాయపురెడ్డి స్వామినాయుడు, సొసైటీ డైరెక్టర్ మద్దిరెడ్డి కుమార్, రంబాల రమేష్, మల్లిపూడి రాజా, వేగేశ్న భాస్కరరాజు, తోట వెంకటేష్, దేవు రాంబాబుతో పాటు అధిక సంఖ్యలో కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు.

### వనువులమ్మకు రూ.2లక్షల విరాళం

అంబాజీపేట, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): అంబాజీపేట కొర్లపాటివారిపాలెం గ్రామదేవత శ్రీవనువులమ్మ అమ్మవార్కి గ్రామానికి చెందిన వలవల రంగారావు జ్ఞాపకార్థం ఆయన కుమారులు, మనవలు రూ.2లక్షలు విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. వలవల వెంకటేశ్వరరావు, వలవల బాబి, కొర్లపాటి చంటి, పత్తి శివ, నైనాల ప్రభాకర్ పాల్గొన్నారు.

### పీహెచ్‌సీ వైద్యాధికారిణిపై కలెక్టర్‌కు ఫిర్యాదు

అంబాజీపేట, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా ఉన్న తనను ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలకు పిలవకుండా ముక్కామల పీహెచ్‌సీ వైద్యాధికారులు అవమానిస్తున్నారని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈనెల12న జరిగిన డీవార్మింగ్ మాత్రల పంపిణీలో కనీస సమాచారం ఇవ్వలేదన్నారు. అలాగే స్వాతంత్ర్య వేడుకలకు పిలవకుండా అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు.

### సొసైటీలను లాభాల బాట పట్టించండి: ఎమ్మెల్యే

ఐ.పోలవరం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): రైతులకు సేవలందించే సొసైటీలను లాభాల బాట పట్టించేందుకు పాలకవర్గాలు కృషి చేయాలని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. సోమవారం జరిగిన ఐ.పోలవరం సొసైటీ త్రీమెన్ కమిటీ ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే బుచ్చిబాబు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సొసైటీ అధ్యక్షుడిగా టీడీపీకి చెందిన కాకర్లపూడి సత్యవెంకటరాయపరాజు(బుజ్జి), సభ్యులుగా మద్దిరెడ్డి వినాయకవీరవెంకటనాగకుమార్, చోడిశెట్టి వెంకటసత్యనారాయణ(వీరబాబు) ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి(బాబు), మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు నాగిడి నాగేశ్వరరావు, గుత్తుల సాయి, దాట్ల పృథ్వి, కాకర్లపూడి రాజేష్, సాగిరాజు సూరిబాబురాజు, చెల్లి అశోక్, రాయపురెడ్డి రాజా, జనసేన నాయకులు గుద్దటి జమ్మి, గోదాసి పుండరీష్, మల్లిపూడి రాజా, ముత్యాల జయలక్ష్మి, రంబాల రమేష్, నీటిసంఘం అధ్యక్షులు రాయపురెడ్డి స్వామినాయుడు, చోడిశెట్టి నాగబాబు, సాగి వాసురాజు, ఎంఎస్ఎన్ రాజు, పెంట రవిప్రసాద్‌తో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### సుదర్శన హోమానికి విరాళం

అంతర్వేది, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి దర్శనం అనంతరం నిత్య నారసింహ సుదర్శన హోమానికి బాపట్ల జిల్లా రేపల్లె మండలం నుండారుకు చెందినకొల్లి వెంకటసూర్యనాగమల్లేశ్వరరావు, కుటుంబ సభ్యులు రూ.లక్ష విరాళాన్ని ఆలయ సహాయ కమిషనర్ ఎంకేటీఎన్వీ ప్రసాద్‌కు అందించారు. దాతలకు స్వామివారి చిత్రపటం, ప్రసాదం అధికారులు అందించారు.

### సొసైటీ చైర్‌పర్సన్‌గా శ్రీను

అయినవిల్లి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): కె.జగన్నాథపురం ఉమామహేశ్వర పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా నల్లా శ్రీను సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మిద్దే నూతన రవిరాజ్, సరెళ్ల రాజ్‌కుమార్‌లు సభ్యులుగా బాధ్యతలు స్వీకరించారు. వారిని బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు యనమదల వెంకటరమణ, అసెంబ్లీ కన్వీనర్ చీకురుమెల్లి వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి వెంకటేశ్వరరావు, మోర్త సత్తిబాబు, మొగలి దుర్గారావు, నల్లా సత్తిబాబు అభినందించి సత్కరించారు.

## వందలాది ఎకరాల వరి పంట మునక



మండలంలో నీట మునిగిన వరి పొలాలు

కాట్రేనికోన, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): తుఫాను ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలో వందలాది ఎకరాల వరిచేలు ముంపు బారిన పడ్డాయి. చెయ్యేరు రంగరాజుకోడు, గొరగనమూడి, ఓల్డ్‌అయినాపురం, గెద్దనపల్లి, పల్లంకుర్రు డ్రెయిన్లతో పాటు మండలంలోని 33 మైనర్ డ్రెయిన్లు పొంగి ప్రవహించడంతో పొలాల్లో నీరు దిగే మార్గం లేక చెరువులను తలపిస్తున్నాయి. మరో రెండు రోజులు ఇలానే ఉంటే వరిపైరు కుళ్లిపోయే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మత్స్యకార గ్రామాలైన మగసానితిప్ప, బలుసుతిప్ప, నీలరేవు, మొల్లేటిమొగ, కొత్తపాలెం, పల్లం, చిర్రయానాం, నవడపల్లి పల్లిపాలెం గ్రామాలు ముంపు బారిన పడ్డాయి. ఆయా గ్రామాల్లో మత్స్యకారులు నాలుగు రోజులుగా చేపల వేటకు వెళ్లక పోవడంతో జీవనోపాధికి ఆటంకం కల్గింది.

### భారీ వర్షాలు.. ముంపులో పంటలు

అల్లవరం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు కొమరగిరిపట్నం, బెండమూర్లంక, గోడిలంక, మొగళ్లమూరు, తూర్పులంక, అల్లవరం పరిసర గ్రామాల్లో వరి పొలాలు ముంపు బారిన పడ్డాయి. రామేశ్వరం మొగద్వారా డ్రెయిన్ల నుంచి సక్రమంగా ముంపునీరు దిగడంలేదని రైతులు ఆరోపిస్తున్నారు. భారీవర్షాలతో వాసాలతిప్ప, పంచనది, లోయర్ కౌశిక, వాటి అనుబంధ డ్రెయిన్లు ముంపునీటితో పొంగి ప్రవహిస్తున్నాయి.

## లింగ నిర్ధారణ నిషేధ చట్టాన్ని అమలు చేయాలి



అల్ట్రాసౌండ్ కేంద్రంలో తనిఖీ చేస్తున్న డీఆర్వో మాధవి

అమలాపురం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఇన్‌చార్జి జిల్లా రెవెన్యూ అధికారి కె.మాధవి ఆదేశించారు. అల్ట్రాసౌండ్ స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు, వైద్యాధికారులు, కమిటీ సభ్యులకు ఆదేశాలిచ్చారు. సోమవారం ముమ్మిడివరంలోని మహిక ఆసుపత్రి, అమలాపురంలోని భూపయ్య అగ్రహారంలో ఉన్న సాయిరవీంద్ర ఆసుపత్రిల్లో ఉన్న అల్ట్రా స్కానింగ్ కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీచేసి లింగ నిర్ధారణ తనిఖీ చట్టం ప్రకారం ఆమె ఆరా తీశారు. ఆడ శిశువుల జననాల పట్ల వివక్షను అరికట్టే చర్యల్లో భాగంగా జిల్లాలో పిండ లింగ నిర్ధారణ పరీక్షల నిషేధిత చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఆమె ఆదేశించారు. ఈసందర్భగా నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖ అధికారి సీహెచ్‌వీ భరతలక్ష్మి, ఆయా అల్ట్రా సౌండ్ కేంద్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## రైతులకు శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు

ముమ్మిడివరం, ఆగస్టు18(ఆంధ్రజ్యోతి): అధిక వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లాలో పల్లపు ప్రాంతాల్లోని వరి ముంపు బారిన పడిందని వాటి రక్షణకు చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు సూచించారు. ప్రస్తుతం వరి నాట్లు పూర్తయి పిలకలు తొడిగే దశలో ఉన్నందున క్షేత్రస్థాయిలో అధికారులు రైతులకు అందుబాటులో ఉండి సూచనలు, సలహాలు అందించాల్సిందిగా ఆదేశించామన్నారు. ప్రస్తుతం నీట మునిగిన వరి పొలాలకు తీసుకోవాల్సిన చర్యలపై వరి పరిశోధన ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.గిరిజారాణి, సహాయ పరిశోధనా సంచాలకుడు డాక్టర్ టి.శ్రీనివాస్‌లు రైతులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఖరీఫ్‌లో జిల్లాలో ఎంటీయూ 7029(స్వర్ణ), ఎంటీయూ 1318, ఎంటీయూ 1061 (ఇంద్ర), ఎంటీయూ 1064(అమర) రకాలు ముంపునకు తట్టుకుంటాయని, నాట్లు వేసిన వెంటనే వరి నీట మునిగి మొక్కలు చనిపోతే మనేదలు వేసుకోవాలన్నారు. నారుమడి లేక విత్తనం వెదజల్లినవి నీట మునిగితే వీలైనంత త్వరగా నీటిని బయటికి తీసి వేయాలన్నారు.

### మొగలుల దౌర్జన్యాలను ఎదురించిన ధీశాలి పాపన్నగౌడ్

అమలాపురం రూరల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మొగలుల దౌర్జన్యాలను ఎదురించి పోరాడిన ధీశాలిగా సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. పాపన్నగౌడ్ 375వ జయంతిని సోమవారం కామనగరువులో ఘనంగా నిర్వహించారు. తొలుత పాపన్నగౌడ్ విగ్రహానికి ఎమ్మెల్యేతో పాటు పలువురు ప్రముఖులు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆయన పోరాట స్ఫూర్తిని వివరించారు. బహుజన రాజ్యాధికారం కోసం పోరాడిన ధీశాలిగా కొనియాడారు. నీటి సంఘం అధ్యక్షుడు రాజులపూడి వెంకటేశ్వరరావు (భీముడు), మార్కెట్ కమిటీ చైర్మన్ అధికారి జయవెంకటలక్ష్మి, టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొలమూరి ధర్మపాల్, ఉపసర్పంచ్ రాజులపూడి భాస్కరరావు, నందుల సత్తిబాబు, గౌడ సంఘం నాయకులు ముప్పిడి శ్రీను, రాజులపూడి మహేశ్వరరావు, రాజులపూడి సత్యనారాయణ, రాజులపూడి నాగేశ్వరరావు, రాజులపూడి మురళీ, కామన గంగాధరరావు, వాకా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

**అమలాపురం టౌన్‌లో..**

పట్టణ గౌడ సంఘం ఆధ్వర్యంలో అమలాపురం శ్రీదేవి మార్కెట్ సెంటర్‌లో మట్ట రవికిశోర్ ఆధ్వర్యంలో గెరిల్లా పోరాట యోధుడు సర్దార్ సర్వాయిపాపన్నగౌడ్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పలువురు ప్రముఖులు పూలమాలలువేసి నివాళులర్పించారు. సంఘ గౌరవాధ్యక్షుడు వీరిన సాయిరామ్, ప్రధాన కార్యదర్శి దాసరి శ్రీనివాస్, అయినవిల్లి నాగేంద్రకుమార్, వెలిగట్ల జగదీష్, మట్ట ప్రవీణ్‌గౌడ్, కొండేటి ప్రసాద్‌గౌడ్, కామన కల్యాణరాముడు, రేలంగి కుమార్‌శంకర్‌గౌడ్, అయినవిల్లి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### జీవో 30ను తక్షణం రద్దుచేయాలి

అమలాపురం రూరల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల పాలిట శాపంగా మారిన జీవో నంబరు 30ను తక్షణం రద్దు చేయాలని వైసీపీ విద్యార్థి విభాగం రీజనల్ కోఆర్డినేటర్ జిల్లెల్ల రమేష్ ఆధ్వర్యంలో సోమవారం ఎ.వేమవరంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. రాష్ట్రంలో అంబేద్కర్ రచించిన రాజ్యాంగం లేదని, రెడ్‌బుక్ పాలన, ఎల్లోబుక్ ఎడ్యుకేషన్ పాలసీ నడుస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు వింటి రాజా, కీర్తి రైనా, దేవరపల్లి గౌతమ్, ఉండ్రు వినోద్, గెల్లా శ్రీనాథ్, మారే రవితేజ, గెడ్డం రమేష్, బన్నీ, మధ పాల్గొన్నారు.

### వర్షాలతో రేవులో ప్రయాణాలు నిలుపుదల

మామిడికుదురు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని గోగన్నమఠం, కరవాక రేవులోని ప్రయాణాలను సోమవారం తాత్కాలికంగా నిలిపివేశారు. అధికారుల ఆదేశాల మేరకు ఇన్‌చార్జి ఎంపీడీవో అడబాల శ్రీనివాస్ ఆయా రేవులను పరిశీలించి స్థానికులతో మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు. ఆయా రేవుల్లో పడవల రాకపోకలు నిలిపివేయించి అక్కడకు వచ్చిన ప్రయాణికులను వెనక్కి పంపించారు. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు ప్రయాణాల నిలుపుదల కొనసాగుతుందన్నారు.

### వైనతేయ రేవుల్లో రాకపోకలు నిలిపివేత

అల్లవరం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): వైనతేయ గోదావరి వరద నీటి కారణంగా రేవుల్లో రాకపోకలు నిలిపివేసినట్టు తహశీల్దార్ వీవీఎల్ నరసింహం సోమవారం తెలిపారు. వైనతేయ గోదావరికి వరద నీరు పోటెత్తిన కారణంగా ఓడలరేవు, బెండమూర్లంక రేవుల్లో పడవల ద్వారా ప్రయాణికుల రాకపోకలు నిలిపివేశామన్నారు.

### అనధికార లేఅవుట్లలో ప్లాట్లు, స్థలాల క్రమబద్ధీకరణకు అవకాశం

ముమ్మిడివరం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): అనధికార లేఅవుట్లలో ప్లాట్లు, స్థలాలు కొనుగోలు చేసినవారు వాటిని క్రమబద్ధీకరణ 90రోజుల్లో ఎల్ఆర్ఎస్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ముమ్మిడివరం నగర పంచాయతీ కమిషనర్ పి.రవివర్మ పేర్కొన్నారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలెప్మెంట్ డిపార్టుమెంట్ వారు 134జీవో ద్వారా అనధికార లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ నిబంధనలు 2020ను సవరణ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని దీని ప్రకారం నగర పంచాయతీ పరిధిలో జూన్ 30కు ముందు ఎవరైనా అనధికార లేఅవుట్లలో ప్లాట్లు, స్థలాలు కొనుగోలు చేసిన వారు క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

### ఇంటర్ విద్యార్థిని వైద్యానికి ఆర్థిక సాయం

మామిడికుదురు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోన్న లక్కవరానికి చెందిన విద్యార్థిని నయినాల జాహ్నవిపుష్ప కొలాయిడ్ సిస్ట్‌వ్యాధితో బాధపడుతోంది. వంగవీటి మోహనరంగా-రాధామిత్ర మండలి సభ్యులు సోమవారం రూ.1.18లక్షలు సోమవారం విద్యార్థినితండ్రి సాంబమూర్తికి అందించారు. స్థానిక యువత, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

### కోనసీమ అందాల ఫొటో ప్రదర్శన



మలికిపురం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మలికిపురం ఎంవీఎన్‌జేఎస్ అండ్ ఆర్వీఆర్ డిగ్రీ కళాశాలలో సోమవారం దిప్రొఫెషనల్ ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, సఖినేటిపల్లి మండల ఫొటో గ్రఫీ అసోసియేషన్ రాజమహేంద్రవరం ఆధ్వర్యంలో కోనసీమ అందాల ఫొటోల ప్రదర్శన నిర్వహించారు. కోనసీమలోని పలు ముఖ్య ఘట్టాలను, సాంస్కృతి సంప్రదాయాలకు సంబంధించిన ఫొటోలను ప్రదర్శనలో ఉంచారు.ముషిణి వెంకటేశ్వరరావు, గెడ్డం సురేష్, సీవీరావు, నల్లి శ్రీనివాస్, బుంగ రత్నకుమార్, నల్లి కృష్ణమీనన్, కంచి ప్రసాద్, పాలపర్తి శేఖర్, బాలాజీ పాల్గొన్నారు.

### సాంకేతికతతో విద్యలో రాణించాలి

అల్లవరం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఓడలరేవు బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో ఆధునిక టెక్నాలజీతో కోర్సులు జరుగుతున్నందున, దానికి అనుగుణంగా పరిమితి పెంచుకోవాలని కళాశాల చైర్మన్ బోనం కృష్ణసతీష్ అన్నారు. కళాశాలలో సోమవారం బీటెక్ మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభించారు. విద్యార్థినీ విద్యార్థులు తల్లిదండ్రులతో సోమవారం సమావేశం నిర్వహించారు. కళాశాల వైస్‌చైర్మన్ బోనం కనకదుర్గ, ప్రిన్సిపాల్ డాక్టర్ డి.మహేశ్వర్, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ప్రవీణ్, హెచ్‌వోడీ ఎ.దుర్గామాధురి, కె.రాజశేఖర్, బి.శ్రీనివాస్, ఏవో ఏవైఆర్వీ ప్రసాద్ పాల్గొన్నారు.

### ఉపాధ్యాయుడికి సత్కారం

అంబాజీపేట, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): తొండవరం హైస్కూల్ ఆంగ్ల ఉపాధ్యాయుడిగా ఉద్యోగవిరమణ చేసిన మానుకొండ చంద్రరావును స్థానిక పాఠశాలలో నాయకులు, ఉపాధ్యాయులుసత్కరించారు. హెచ్ఎం పీవీకేశవాచార్యులు అధ్యక్షతన జరిగిన సభలో ఎంఈవో-2 మోకా ప్రకాష్ పాల్గొన్నారు.

### రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి


**డాట్ ప్రధాన శాస్త్రవేత్తలు**



ముంపు బారిన పడిన వరి పొలాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం

ముమ్మిడివరం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కురుస్తున్న అధిక వర్షాల దృష్ట్యా రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ సాంకేతిక సలహా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త, కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.నందకిశోర్, కీటక శాస్త్రం ప్రధాన శాస్త్రవేత్త వి.రాధిక, డిజియోలజీ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.వెరోనిక, జిల్లా వనరులకేంద్రం ఏవో జె.మనోహర్‌లతో కూడిన బృందం సోమవారం ముమ్మిడివరం, అయినవిల్లి, అమలాపురం మండలాల్లో వర్షాలకు ముంపు బారిన పడిన వరి పొలాలను పరిశీలించి రైతులకు సూచనలిందించారు. ప్రస్తుతం కురుస్తున్న అధిక వర్షాలకు పల్లపు ప్రాంతాల్లో వరినాట్లు నీట మునిగాయన్నారు. ప్రస్తుతం వేసిన నాట్లు పిలకలు వేసే దశలో ఉన్నాయని, ఇవి ముంపునకు గురి కావడం జరిగిందన్నారు. ప్రస్తుత వాతావరణంలో ఆసించే తెగుళ్ల నివారణకు లీటరు నీటికి ఒక గ్రాము కార్బన్డిజం లేదా 2 గ్రాముల కార్బన్డిజం, మ్యాంగోజెబ్‌ను కలిపి పిచికారీ చేసుకోవాలని వారు సూచించారు. శాస్త్రవేత్తలు ముమ్మిడివరం మండలం కొత్తలంక, అయినవిల్లి మండలం నల్లచెరువు, నేదునూరు, అమలాపురం మండలం వేమవరప్పాడు తదితర గ్రామాల్లో పర్యటించి రైతులకు సూచనలు, సలహాలు అందించారు.

### రెస్క్యూ టెండర్ పరికరాల వినియోగంపై శిక్షణ



అమలాపురం టౌన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలకు సంబంధించి రాజమహేంద్రవరం కేంద్రంగా ఉన్న ఒకే ఒక వాహనం ఇది. ఇటు తుని నుంచి అటు ఏలూరు వరకు ప్రకృతి విపత్తులతో పాటు పెద్దపెద్ద ప్రమాదాలు సంభవించినప్పుడు రక్షణ కవచంగా నిలిచే ఈ వాహనాన్ని అగ్నిమాపక శాఖ రెస్క్యూ టెండర్‌గా పిలుస్తుంది. ఈ వాహనంలో విపత్తుల సమయంలో వినియోగించే వివిధ రకాల పరికరాలపై అగ్నిమాపక సిబ్బందికి ఏరియాల వారీగా శిక్షణ ఇచ్చే ఏర్పాట్లను ఆ శాఖ ఉన్నతాధికారులు చేపట్టారు. రెస్క్యూ టెండర్ వాహనం సోమవారం అమలాపురం అగ్నిమాపక కేంద్రం వద్దకు చేరుకుంది. అగ్నిమాపకాధికారి ఎం.రాజు ఆధ్వర్యంలో వివిధ పరికరాల వినియోగంపై శిక్షణ ఇచ్చారు. రామచంద్రపురం, మండపేట, కొత్తపేట, రాజోలు, ముమ్మిడివరం అగ్నిమాపక సిబ్బందికి దశలవారీగా శిక్షణ ఇస్తామని వివరించారు.

### ప్రభుత్వ కళాశాల విద్యార్థుల ఫీజు చెల్లించిన దాత

మలికిపురం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): కేశనపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు చెల్లించాల్సిన అడ్మిషన్ ఫీజు, ట్యూషన్ ఫీజులు రూ.58 వేలు అదే గ్రామానికి చెందిన అడబాల శ్రీఆంజనేయులు, అడబాల భాస్కరరావులు సోమవారం కళాశాలకు చెల్లించారు. 2019లో ఈకళాశాల ప్రారంభం నుంచి ప్రతీఏటా వీరు ఈవిధంగా ఫీజులు చెల్లిస్తున్నారు. సర్పంచ్ యెనుముల నాగు, అధ్యాపకులు పి.అలివేలు మంగతాయారు, నాగరాజు పాల్గొన్నారు. కళాశాల తరపున సిబ్బంది వారికి కృతజ్ఞతలు తెలిపారు.

### పేకాట శిబిరంపై దాడి

ముమ్మిడివరం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఠాణేలంక గోదావరి ఒడ్డున పేకాట శిబిరంపై ఎస్ఐ డి.జ్వాలాసాగర్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. ఐదుగురు వ్యక్తులను అరెస్టుచేసినట్టు, వారి నుంచి రూ.2030 స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు.

### రాముకు ఎమ్మెల్యే గిడ్డి పరామర్శ

అంబాజీపేట, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): కాపు ఉద్యమనాయకుడు దాసరి రాము కుమార్తె శేషసాయిప్రియాంక(22) కేన్సర్ వ్యాధితో మృతిచెందింది. సోమవారం పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ గుంటూరులోని రామును ఆయన నివాసంలో పరామర్శించారు. శేషసాయి ప్రియాంక చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

### ఐకేపీ ఏపీఎంగా దుర్గాకుమారి

అంబాజీపేట, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): వెలుగు కార్యాలయం ఏపీఎంగా ఎం.దుర్గాకుమారి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఏపీఎం గంగాధర్ బదిలీ అయ్యారు. దుర్గాకుమారి కాట్రేనికోన నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు.

### సరస్వతీదేవి విగ్రహం ఏర్పాటు

మామిడికుదురు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మొగలికుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో 1996-97 పదో తరగతి పూర్వ విద్యార్థులు రూ.4.50లక్షలతో సరస్వతీ దేవి విగ్రహం, మండపాన్ని ఏర్పాటు చేశారు. సోమవారం ప్రత్యేక పూజల నడుమ విగ్రహావిష్కరణ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కొండా మల్లేశ్వరగాంధీ, నగరం ఏఎంసీ చైర్మన్ పెనుమాల లక్ష్మీ, సర్పంచ్ కడలి అరుణకుమారి, కాశిన లక్ష్మీపతి, దొంగ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.



ఆలమూరు మండలం చిలకలపాడులో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బండారు

## రహదారుల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి

### ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

ఆలమూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ప్రాంతాలు అభివృద్ధి చెందాలంటే రోడ్లు సక్రమంగా ఉంటే ఆ ప్రాంతం అన్ని రంగాల్లో ముందంజలో ఉంటుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. మడికి-చిలకలపాడు రోడ్లను నాబార్డు నిధులతో నిర్మించనున్న రహదారికి సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సూపర్‌సిక్స్ అమలులో భాగంగా మహిళలకు ఉచిత బస్సు అమలులోకి వచ్చిందన్నారు. అక్కడ ఉన్న మహిళల అభిప్రాయాలను ఆయన తెలుసుకున్నారు. చిలకలపాడు గ్రామస్తులు పలు సమస్యలపై వినతిపత్రాలు అందించారు. చిలకలపాడు అభివృద్ధికి, వారి సమస్యల పరిష్కారానికి పూర్తిస్థాయిలో కృషి చేస్తానని స్థానికులతో ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎ.రాజు, సర్పంచ్ ఉండ్రాసపు మౌనిక, ఏఎంసీ ఛైర్మన్ కొత్తపల్లి వెంకటలక్ష్మి, నాయకులు దొండపాటి సుబ్బరాజు, ఈదర రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## వాడపల్లిలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శ్రీకారం

ఆత్రేయపురం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో వివిధ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే బండారు పరిశీలించి ఆయా పనులకు శ్రీకారం చుట్టారు. సోమవారం ఆలయంలోని ద్వారాల వెడల్పు పనులకు ఆయన పూజలు జరిపి కొబ్బరికాయ కొట్టి శ్రీకారం చుట్టారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ద్వారాల వెడల్పు పనులు త్వరితగతిన చేపట్టాలని ఆదేశించారు. ఆలయం ఎదురుగా కొనేరు అభివృద్ధి పనులను పరిశీలించారు. మాడవీధులు, ఆలయంలో భక్తుల సౌకర్యాలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఆలయ ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు, ముదునూరి వెంకట్రాజు, టీడీపీ మండల అధ్యక్షుడు కూసంపూడి రామకృష్ణంరాజు, గనిశెట్టి వీరేష్, యేపుగంటి వెంకటేశ్వరరావు, దండు సురేష్ రాజు, తోట రజని తదితరులు పాల్గొన్నారు.



వాడపల్లిలో ద్వారాల వెడల్పు పనులకు శ్రీకారం చుడుతున్న ఎమ్మెల్యే బండారు

## పారిశ్రామికవేత్తల కృషి ప్రశంసనీయం

### నామాల పురుషోత్తం వాకింగ్ ట్రాక్ ప్రారంభంలో నేతలు

మండపేట, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఏడిద గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త నామాల పురుషోత్తం సేవలు వెలకట్టలేనివని మాజీ ఎంపీ దగ్గుబాటి వెంకటేశ్వరరావు అన్నారు. తన సొంత నిధులతో నిర్మించిన వాకింగ్ ట్రాక్‌ను సోమవారం నామాల పురుషోత్తం, అనంతలక్ష్మి కుమారి, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మాజీ దగ్గుబాటి వేంకటేశ్వరరావులతో కలిసి ప్రారంభించారు. చెరువు మధ్యలో నిర్మించిన స్వామి వివేకానంద విగ్రహాన్ని వారు ఆవిష్కరించారు. సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే వేగుళ్ల, మాజీ ఎంపీ దగ్గుబాటి, పారిశ్రామికవేత్త బలుసు శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లా డారు. పారిశ్రామికవేత్తలు పురుషోత్తం, బలుసు శ్రీనివాసరావు తమ వంతు సహకారం అందిస్తామని సభలో తెలి పారు. అనంతరం సర్పంచ్ ఆశీర్వాదం, కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కామన ప్రభాకరరావు మాట్లా డారు గ్రామస్తుల తరపున ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పురుషోత్తం దంపతులను ఎమ్మెల్యే వేగుళ్ల, మాజీ ఎంపీ దగ్గుబాటి, స్థానిక ప్రజాప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిలుకూరి శ్రీనివాసరావు, యువనేత వేగుళ్ల అజయ్‌బాబు, మాజీ మున్సిపల్ ఛైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, డీసీఎంస్ మాజీ ఛైర్మన్ రెడ్డిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఏడిదలో నిర్మించిన వాకింగ్ ట్రాక్ పార్కును ప్రారంభిస్తున్న దృశ్యం

## ఘనంగా సర్దార్ పాపన్నగౌడ్ జయంతి



మెర్లపాలెంలో పాపన్నగౌడ్ జయంతి దృశ్యం

ఆత్రేయపురం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని సోమవారం నిర్వహించారు. ఆత్రేయపురంలో పాపన్నగౌడ్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి నివాళులర్పించారు. మెర్లపాలెంలో గౌడ యువత కేక్‌కట్ చేసి జయంతిని నిర్వహించారు. సర్పంచ్ మెర్ల రాము పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ర్యాలిలో జరిగిన పాపన్నగౌడ్ జయంతిలో భాగంగా బీజేపీ కన్వీనర్ అయినవిల్లి సత్తిబాబుగౌడ్, టీడీపీ మండల కార్యదర్శి గుడేల నాగేంద్రతో పాటు గౌడ్ పెద్దలు పాల్గొన్నారు. వెలిచేరు, ఉచ్చిలి, వద్దిపర్రు, రాజవరం, పేరవరం, బొబ్బర్లంక గ్రా మాల్లో జరిగిన జయంతి వేడుకల్లో అధిక సంఖ్యలో గౌడ యువత తదితరులు పాల్గొన్నారు.



గురుకుల పాఠశాలలో వ్యాక్సినేషన్ పరిశీలిస్తున్న సత్యనారాయణ

## 23 వరకు పాఠశాలల్లో స్పెషల్ వ్యాక్సినేషన్ డ్రైవ్

ద్రాక్షారామ, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం నుంచి ఈనెల 23 వరకు స్కూల్ వ్యాక్సినేషన్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ బీవీవీ సత్యనారాయణ తెలిపారు. సోమవారం ఆయన ద్రాక్షారామ పీహెచ్‌సీని సందర్శించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు అమలు పరిశీలించారు. అనంతరం ద్రాక్షారామలో అంబేడ్కర్ గురుకుల బాలుర పాఠశాలలో పిల్లలకు వ్యాక్సినేషన్ ప్రక్రియను పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. అనంతరం గురుకుల పాఠశాల పిల్లలకు వ్యాక్సిన్ వల్ల కలిగే ఉపయోగాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ వి.స్వాతి భవానీ, డివిజనల్ సూపర్‌వైజర్ కమల్ శేషు, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాస్, హెచ్‌ఎస్‌లు రత్నం, వరలక్ష్మి, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అనధికార లేఅవుట్లలో ప్లాట్లు, స్థలాల క్రమబద్ధీకరణకు అవకాశం

ముమ్మిడివరం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): అనధికార లేఅవుట్లలో ప్లాట్లు, స్థలాలు కొనుగోలు చేసినవారు వాటిని క్రమబద్ధీకరణ 90రోజుల్లో ఎల్‌ఆర్‌ఎస్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ముమ్మిడివరం నగర పంచాయతీ కమిషనర్ పి.రవివర్మ పేర్కొన్నారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలెప్మెంట్ డిపార్టుమెంట్ వారు 134జీవో ద్వారా అనధికార లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ నిబంధనలు 2020ను సవరణ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని దీని ప్రకారం నగర పంచాయతీ పరిధిలో జూన్ 30కు ముందు ఎవరైనా అనధికార లేఅవుట్లలో ప్లాట్లు, స్థలాలు కొనుగోలు చేసినవారు క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

### దివ్యాంగ పింఛన్లు కొనసాగించాలి

రాయవరం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): గతంలో జారీ చేసిన వైకల్య ధ్రువీకరణ పత్రాల్లో ఉన్న శాతాన్ని తగ్గించడం సమంజసం కాదని దివ్యాంగ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖండవిల్లి భరత్ కుమార్ అన్నారు. సోమవారం వెంటూరులో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం దివ్యాంగులందరి పింఛన్లు కొనసాగించాలని డిమాండ్ చేశారు.



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

### వానపల్లిలో ఘనంగా వేంకటేశ్వరస్వామి వార్షికోత్సవం

కొత్తపేట, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): వానపల్లిలో ఉన్న కల్యాణ వేంకటేశ్వరస్వామి ప్రథమ వార్షికోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. పెనుగొండ మండలం చెరుకువాడకు చెందిన ఖండవిల్లి సూర్యనారాయణాచార్యులు శిష్య బృందం ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు పెద్దింటి చక్రధరాచార్యులుతో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం ప్రసాద వితరణతో పాటు అన్న సమారాధన జరిపారు.



మెర్లపాలెం పాఠశాలను పరిశీలిస్తున్న దృశ్యం

### పాఠశాలను పరిశీలించిన అధికారులు

ఆత్రేయపురం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షాలకు సోమవారం పలు ప్రభుత్వ పాఠశాలలను ఎంపీడీవో వెంకటరామన్, ఎంఈవో వరప్రసాద్ పరిశీలించారు. మెర్లపాలెం ప్రాథమిక పాఠశాల భవనం తీరుతెన్నులను పరిశీలించి విద్యార్థులు, ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యార్థులకు ఇబ్బందుల్లేకుండా ఉండేందుకు ఆయా పాఠశాలలను పరిశీలిస్తున్నట్టు వారు తెలిపారు.

### మండపేటలో రెండు బార్లకు నోటిఫికేషన్



ఆలమూరు ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు

ఆలమూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఆలమూరు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని మండపేట టౌన్‌లో రెండు బార్లకు నోటిఫికేషన్ విడుదల చేసినట్టు ఆలమూరు ఎక్సైజ్ సీఐ ఐడీ నాగేశ్వరరావు తెలిపారు. బార్ లైసెన్స్ కోసం దరఖాస్తుదారులు దరఖాస్తుతోపాటు రూ.5.10 లక్షలు చెల్లించాల్సి ఉంటుందని ఈ మొత్తం తిరిగి ఇవ్వబడదన్నారు. సోమవారం నుంచి దరఖాస్తులు అమలాపురం ఈఎస్ కార్యాలయంలో స్వీకరిస్తారని తెలిపారు. ఏడాదికి రూ.55 లక్షల ఫీజుగా నిర్ణయించామని ప్రతి ఏడాది 10శాతం అదనంగా ఉంటుందన్నారు. ఈనెల 26 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని 28న లాటరీ పద్ధతిలో లైసెన్స్ కేటాయింపులు చేయనున్నట్లు సీఐ నాగేశ్వరరావు తెలిపారు. ప్రతి బార్‌కు కనీసం నాలుగు దరఖాస్తులుంటేనే లాటరీ తీస్తారని ఆయన అన్నారు.



ద్రాక్షారామ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న ఎన్టీఆర్ అభిమానులు

### ఎమ్మెల్యే దగ్గుపాటిపై ఫిర్యాదు

ద్రాక్షారామ, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): జూనియర్ ఎన్టీఆర్‌పై ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ దూషించడం పట్ల ఎన్టీఆర్ అభిమానులు సోమవారం ద్రాక్షారామ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎన్టీఆర్ సేవా సమితి గౌరవాధ్యక్షుడు వాసంశెట్టి శ్రీనివాసకుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ సేవా సమితి అధ్యక్షుడు సాదే రాజేష్‌కుమార్, కార్యదర్శి శీలం మణికంఠ, జాయింట్ సెక్రటరీ పాటి సుబ్బు, ప్రచార కార్యదర్శి శేఖర్ తదితరులతో పాటు, అధిక సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.

## వర్షం ముంపుతో ప్రజల అవస్థలు

రావులపాలెం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం ఉదయం నుంచి చిరుజల్లులు పడుతూ ఆ తర్వాత తగ్గుదల కనిపించింది. కాగా సాయంత్రం నుంచి మళ్లీ కుండపోతగా వర్షం కురవడంతో పలు పల్లపు ప్రాంతాలు జలమయమవుతున్నాయి. ఒకపక్క పంట పొలాలు ముంపుబారిన పడుతుండగా గ్రామాల్లోని పలు కాలనీ రహదారుల్లో వర్షపు నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఆయా ప్రాంత ప్రజలు రాకపోకలకు అంతరాయం కలుగుతోంది.



రావులపాలెం మండలం పొడగట్లపల్లిలో భారీ వర్షానికి జలమయమైన కాలనీ

### నీటి ముంపునకు వరిలో తీసుకోవల్సిన జాగ్రత్తలు

కపిలేశ్వరపురం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా నీటి ముంపునకు గురైన వరిలో తీసుకోవల్సిన జాగ్రత్తలు, మెళకువలపై ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.గిరిజారాణి, సహ పరిశోధన సంచాలకులు, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం మార్టేరు డాక్టర్ టి.శ్రీనివాస్ వివరించినట్లు ఏవో బలుసు రవి తెలిపారు. సోమవారం ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పల్లపు ప్రాంతాల్లోని వరిపంట నీటి ముంపునకు గురైందన్నారు. ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసిన ఎంటీయూ 1318, స్వర్ణ, సంపదస్వర్ణ, ఎంటీయూ 1061, ఎంటీయూ 1064 రకాలు ఐదురోజుల వరకు తట్టుకుంటాయన్నారు. నారుమడి లేదా ఎదపద్ధతిలో విత్తిన పొలం నీట మునిగితే మొలకశాతం గణనీయంగా తగ్గుతుందన్నారు. వీలైనంత త్వరగా మడిలో నుంచి నీటిని బయటకు తీసివేసి పొలం ఆరగట్టాలన్నారు. నారుమడి పూర్తిగా దెబ్బతిన్న ఎడల అందుబాటులో ఉన్న స్వల్పకాలిక రకాలతో మళ్లీ విత్తుకోవాలని రైతులకు ఆయన సూచించారు. నీటమునిగిన నారుమడి నుంచి వీలైనంత త్వరగా నీటిని తీసివేసి 5 సెంట్ల నారుమడికి 1.0 కిలోల యూరియా+1.0 కిలోల పొటాష్ వేయాలన్నారు. ఇప్పుడున్న వాతావరణంలో ఆశించే తెగుళ్ల నివారణకు లీటరు నీటికి 1.0 గ్రాముల కార్బెన్డిజమ్ లేదా 2.0 గ్రాముల కార్బెన్డిజిమ్+ మాంకోజెబ్ కలిపి పిచికారి చేయాలన్నారు. పిలకలు కట్టే దశలో నీటమునిగిన వరి పొలం త్వరగా పుంజుకోవడానికి, వీలైనంత త్వరగా నీటిని తీసివేసి ఎకరాకు 20 కిలోల యూరియా, 10-15 కిలోల పొటాష్ అదనంగా వేసుకోవాలని రైతులకు ఆయన సూచించారు.

## ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి

కె.గంగవరం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనతో పాటు దైవభక్తి కలిగి ఉండాలని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. సోమవారం సత్యవాడ గ్రామంలో వరాల కనకదుర్గ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠను భక్తిశ్రద్ధలతో జరిపారు. దీనికి మంత్రి సుభాష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కన్నుల పండువగా జరుగుతున్న ఈ కార్యక్రమంలో తాను పాల్గొనడం పూర్వజన్మ సుకృతం అన్నారు. అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠతో పాటు ఆలయంలో మహాగణపతి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహాల ప్రతిష్ఠను జరిపారు. ప్రతిష్ఠలో భాగంగా మూడు రోజులుగా ఆలయం వద్ద వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తోట వెంకన్న, సలాది శ్రీను, సీతారాముడు, సలాది రమేష్ తదితరులు పాల్గొన్నారు.



వరాల కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్న మంత్రి సుభాష్, కూటమి నాయకులు



కోరుమిల్లిలో గోపాలకృష్ణ విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు

### ఘనంగా గోపాలకృష్ణ విగ్రహ ప్రతిష్ఠ

కపిలేశ్వరపురం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కోరుమిల్లి గౌతమీ నదీతీరాన ఏటిగట్టుపై సోమవారం గోపాలకృష్ణ విగ్రహ ప్రతిష్ఠను జరిపారు. వేద పండితులు పలువురు స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ పూజలను వేద మంత్రాల మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన సలాది సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులు సొంత ఖర్చులతో విగ్రహ ప్రతిష్ఠను నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్థులతో పాటు అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు, విగ్రహ నిర్వాహకులు పాల్గొన్నారు.

## పీఠంలో వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



విజయదుర్గా పీఠంలో వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

రాయవరం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): వెదురుపాక విజయదుర్గా పీఠంలో వేంకటేశ్వర స్వామి కల్యాణాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. తిరుపతికి చెందిన వేదపండితుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైఖానస ఆగమనం ప్రకారం శ్రీనివాసుని కల్యాణం నిర్వహించారు. తొలుత పీఠంలో ఉన్న స్వామివారి విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. కల్యాణంలో భాగంగా తొలుత విశ్వక్సేనపూజ, పుణ్యాహ వచనం, రక్షాబంధనం, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ఠాపన, మధుపర్క సమర్పణ, కన్యాదానం, మంగళపూజ, మాంగళ్యధారణ, తలంబ్రాలు కార్యక్రమాలతో స్వామివారి కల్యాణం నిర్వహించారు. అనంతరం హోమం, పూర్ణాహుతి జరిపించారు. అర్చకస్వాములు శ్రీనివాసుని కల్యాణం విశిష్టతను భక్తులకు వివరించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి గాడ్ మాట్లాడుతూ శ్రీవేంకటేశ్వరస్వామి కల్యా ణాన్ని తిలకించడం వల్ల సకల శుభాలు కలుగుతాయన్నారు. సాయంత్రం అమ్మ వారికి గులాబీ అర్చనలు, నీరాజన మంత్రపుష్పాలు, మహానివేదన జరిపి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అడ్మి నిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, పీఆర్వో బాబి, విజయదుర్గా సేవా సమితి ప్రతినిధులు సత్యవెంకట కామేశ్వరి, భాస్కర నారాయణ దంపతులు సత్య కనకదుర్గ, రమ, కోట సునీల్‌కుమార్, కందర్ప హనుమాన్, భక్తులు పాల్గొన్నారు.

### కోదండ రామాలయం పునర్నిర్మాణానికి భూమిపూజ

ద్రాక్షారామ, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): వెంకటాయపాలెంలోని కోదండ రామాలయం పునర్నిర్మాణానికి సోమవారం వైసీపీ నాయకులు భూమిపూజ చేశారు. రాజ్యసభ ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్ ఆలయ పునర్నిర్మాణానికి రూ.20లక్షలు మంజూరు చేయగా సోమవారం పిల్లి సూర్యప్రకాష్, తోట పృథ్విరాజ్ తదితరులు భూమిపూజ చేశారు.

### రేపు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

కపిలేశ్వరపురం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురం మండల పరిషత్ అత్యవసర సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో జి.రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి దుర్గారావు అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో జరిగే ఈ సమావేశానికి డివిజనల్, మండల స్థాయి అధికారులు, ఆయా శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలను ముందుగా సమర్పించాలని కోరారు. గైర్హాజరైన అధికారుల జాబితాను జిల్లా కలెక్టర్‌కు చర్యల నిమిత్తం పంపుతామని ఆయన తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.



ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న అఖిలపక్ష నాయకులు

### రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడలో విలీనం చేయాలి

ద్రాక్షారామ, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో విలీనం చేసే వరకూ అఖిలపక్ష జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని అఖిలపక్ష నాయకులు అన్నా రు. సోమవారం అఖిలపక్ష జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో రాజగోపాల్ సెంటర్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ప్రదర్శన జరిపారు. ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన జిల్లాల పునర్విభజన సబ్ కమిటీలో రామ చంద్రపురాన్ని కాకినాడ జిల్లాలో విలీనం చేయాలని జేఏసీ సభ్యులు డిమాండ్ చేశారు. ఆర్డీవో అఖిలకు వారు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అఖిలపక్ష జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ మాగాపు అమ్మిరాజు, కోకన్వీనర్ బి.సిద్ధూ, గౌరవాధ్యక్షులు గరిగపాటి సూర్యనారాయణ, ఉండవల్లి గోపాల్‌రావు, గాధంశెట్టి శ్రీధర్, గొల్లపల్లి కృష్ణ, ఎం. వెంకటేశ్వరరావు, మద్దాల బాపూజీ, గాలింకి చిట్టిబాబు, దొమ్మలపాటి సత్యనారాయణ, కె. హరిబాబు, వెంకటరమణ, దేగల నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.



## గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి



మోడేకుర్రులో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సత్యానందరావు

కొత్తపేట, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని గ్రామాల్లో ముఖ్యమైన రహదారులు, మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పనిచేస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. సోమవారం మండల పరిధి మోడేకుర్రు గ్రామ పరిధిలో రూ.1.45 కోట్లతో నిర్మాణం చేపట్టే రహదారి నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ సారథ్యంలో రహదారుల అభివృద్ధి జోరుగా జరుగుతోందన్నారు. నియోజకవర్గంలో కోట్లాది రూపాయలు అభివృద్ధి పనులు చేపట్టామని సత్యానందరావు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కుడుపూడి రామలక్ష్మి, గనిశెట్టి వీరేష్, రెడ్డి శ్రీనివాస్, బొక్కా వెంకటకుమార్, సరెళ్ళ రాజబాబు తదితరులతో పాటు పలువురు స్థానికులు పాల్గొన్నారు.





బిళ్లకుర్రు మహాదేవ దేవస్థానం పాలకమండలి ప్రమాణ స్వీకారం దృశ్యం

### మహాదేవ దేవస్థానం పాలకమండలి ప్రమాణ స్వీకారం

కొత్తపేట, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధి బిళ్ళకుర్రు గ్రామంలో మహాదేవ దేవస్థానం పాలకవర్గ ప్రమాణ స్వీకారం సోమవారం ఘనంగా జరిగింది. పాలక మండలి ఛైర్మన్‌గా నల్లం వెంకట శ్రీరామమూర్తి, సభ్యులుగా చోడే హరినాథ్, దేగల మంగాదేవి, రుద్ర వెంకటలక్ష్మి, బిళ్ళకుర్తి నాగేశ్వరరావు, మట్టపర్తి సత్యవతి, దంగేటి బాలరాజు, చావలి గోవింద దీక్షితులు, కందికట్ల మంగాదేవీ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ముత్యాల బాబ్జి, కంఠంశెట్టి శ్రీను, ధర్నాల రామకృష్ణ, గుబ్బల మూర్తి, గనిశెట్టి వీరేష్, తమ్మన సాయిప్రసాద్, వాకాడ చిన్న, ముద్రగడ ఫణి, పాయసం సతీష్, దంగేటి చంటి తదితరులు పాల్గొన్నారు.